ప్రజాశక్తి

Vol. 6, no. 4

(Jan. 24, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 6, no. 4

(Jan. 24, 1945)

Bejavāḍa, 1945

Regd. No. M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 6 బుధవారం 24-1-45 సంచిక 4

ఆంధ్రదేశభక్తులకు - ప్రజలకు

భారతకమ్యూనిస్టుపార్టీ ఆంధ్రకమిటీ

16వ స్వాతంత్ర్యదినోత్సవ విజ్ఞప్తి

సోదరులారా!

ప్రపంచ సంగ్రామం ప్రారంభమయి ఐదేండ్లు అయింది. మూసలో కరిగిన ఇనుమువలె ఈ యుద్ధంలో ప్రపంచమంతా నూతన రూపం దాల్చుతోంది. నాజీ మూకలనుండి విముక్తిపొందిన ప్రతిదేశం తన స్వాతంత్ర్యాన్ని మరల ప్రతిష్ఠించుకొంటూంది. అన్ని జాతుల ప్రజలు తమతమ సంస్కృతికి రూపురేఖలు దిద్దుకొంటూ, తమ జాతీయ వికాసాన్ని పెంపొందించుకోడానికి కృషి చేస్తున్నారు.

1930 లాహోరు కాంగ్రెసులో జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన భారతీయులం స్వాతంత్ర్యదీక్షను పూనాము. నాటినుండి ప్రతియేడు స్వాతంత్ర్యదినోత్సవం జరుపుతున్నాం. ఈ 15 యేండ్లలోను మన జాతీయోద్యమం ఎంతో అభివృద్ధిచెందింది. స్వాతంత్ర్యోద్యమంలో ఒక ముఖ్యమైన భాగంగా ముస్లింలీగు పెంపొందింది. కార్మికోద్యమం, రైతుఉద్యమం, మహిళాఉద్యమం, విద్యార్థి ఉద్యమం విశాలమైన ప్రజావుద్యమాలుగా పెరిగి, మన జాతీయోద్యమానికి అండగా నిలిచాయి.

ఈ పదహారవ స్వాతంత్ర్య దినోత్సవంనాడు మన దేశపరిస్థితులను ఒకసారి సింహావలోకనం చేసికొని, భావికర్తవ్యాన్ని, కార్యక్రమాన్ని నిర్ణయించుకోడం మన విధి. నేడు భరతఖండంలో అనేక ప్రాంతాలలో సోదర ప్రజలు కరువు కాటకాలతో బాధపడుతున్నారు. అంటు వ్యాధులతో క్రుంగి కృశించిపోతున్నారు. లక్షలాది ప్రజలు వీటికి బలి అవుతున్నారు.

1942 ఆగస్టులో బొంబాయి తీర్మానాన్ని సాకుగా తీసికొని, బ్రిటిషుప్రభుత్వం జాతీయనాయకులను ఆకస్మికంగా అరెస్టుచేసింది. దానిఫలితంగా ప్రజలలో క్రోధాగ్ని ప్రజ్వరిల్లింది. బ్రిటిషు సామ్రాజ్యవాదులపైనున్న యీ క్రోధాగ్నిని తప్పుమార్గాన పెట్టడానికి ఫార్వర్డుబ్లాకువాళ్ళు, తదితర జపాను అనుకూలురు విధ్వంసకచర్యలను ప్రోత్సహించారు; దోపిడీలనురెచ్చగొట్టారు. ఇదంతా కాంగ్రెసు కార్యక్రమమని ప్రజలను మోసపుచ్చచూశారు. కాంగ్రెసు నాయకులు జపానుకు అనుకూలురని నిందించిన అమెరీ, లిన్‌లిత్‌గోముఠాకు వీరు సాయపడ్డారు.

కమ్యూనిస్టుపార్టీ నాటినుంచీ విధ్వంసకచర్యలు కాంగ్రెసు కార్యక్రమంకాదని ప్రచారంచేసింది. కాంగ్రెసు మిత్రరాజ్యాల విజయం కోరిందనీ, యుద్ధకృషిని కుంటుపరచడం కాంగ్రెసు తీర్మానానికి విరుద్ధమనీ ప్రచారం చేసింది. తరువాత గాంధీజీ ప్రకటనలు యిదే విషయాన్ని ఋజువుచేశాయి. వర్కింగ్‌కమిటీ తరఫున అధ్యక్షుడు మౌలానా అజాద్ వైస్రాయికి వ్రాసిన జాబుకూడ అదే విషయాన్ని తేటతెల్లంచేసింది.

నేడు ముఖ్యజాతీయనాయకులు యింకా జైళ్ళలోనే వున్నా అనేకమంది కాంగ్రెసు దేశభక్తులు విడుదలవుతున్నారు. వారు వెనుకటి సంఘటనలను సింహావలోకనం చేసుకుని, ముందు కర్తవ్యాన్ని నిర్ణయించుకోవాలసిన రోజులివి.

దేశమంతటా వ్యాపించిన కరువునుండి, అంటువ్యాధులనుండి ప్రజలను రక్షించుకోవలసిన బాధ్యత దేశభక్తులందరిపైనవుంది. కాని, శ్రీమతిసరోజినీదేవి కలకత్తాసభలో చెప్పినట్లుగా కాంగ్రెసుసోదరులు యిందుకు పూనుకోడంలేదు. ప్రజలను రక్షించేబాధ్యత తమదిగా ఎంచడంలేదు. బ్రిటిషుసామ్రాజ్యవాదులే అన్నిటికీ బాధ్యులని నిందించి మెదలక కూర్చుంటున్నారు. గాంధీజీ, సరోజినీదేవి, వర్కింగ్‌కమిటీ అంతా ఆగస్టువుద్యమంతో కాంగ్రెసుకు ఎట్టిసంబంధం లేదన్నతరవాతకూడ ఆవుద్యమాన్ని వ్యతిరేకించినవారిని కాంగ్రెసునుండి వెడలగొట్టాలని ప్రయత్నించుతున్నారు. స్వాతంత్ర్యంకోరే ప్రజలందరిసంస్థ అయిన కాంగ్రెసుచుట్టూ గోడలునిర్మించి, సంకుచితమైన సంస్థగా చేయాలని కోరుతున్నారు.

ఇంతేగాదు. మన జాతీయోద్యమానికి అండగావున్న ప్రత్యేక కార్మిక, కర్షక, విద్యార్థి సంఘాలకు పోటీగా సంఘాలనుపెట్టి ఆయా ప్రజావుద్యమాలను చీల్చడానికి కొందరు ప్రయత్నించుతున్నారు. కాంగ్రెసు సాంప్రదాయాలకే విరుద్ధంగా ప్రవర్తించుతున్నారు.

ఇట్టి కాంగ్రెసువాదులకు వర్కింగ్‌కమిటీ సభ్యురాలైన శ్రీమతి సరోజినీదేవి కలకత్తాలో ఇచ్చిన ఉపన్యాసం చక్కని హెచ్చరిక. ఆమె ఏమిచెప్పిందో వినండి :

"దేశంలో మహాసంక్షోభాలు వ్యాపించినపుడు రాజకీయ పక్షాలకంటె మానవజీవితం ఉత్కృష్టమని యెంచాలి. మానవ జీవితం కాంగ్రెసుకంటె, భగవంతునికంటె కూడ ఉత్కృష్టమైనది. ఈవిషయంలో కాంగ్రెసు ప్రచారకులు చేసిన పెద్ద లోపాన్ని నేను చూపవలసివుంది. కరువుబాధితులకు సహాయం చేయడానికి వారెందుకు నిర్మాణకృషిలో పాల్గొనలేదు? ప్రభుత్వ నిషేధాజ్ఞలు వుంటేనేమి? ఉండకపోతేనేమి? కరువునివారణ పనులన్నీ కమ్యూనిస్టులకీ, ముస్లింలీగ్‌కీ, హిందూమహాసభవారికీ ఎందుకు వదలివేయవలసివచ్చింది? ఒకవైపున వేలకొద్దీ ప్రజలు ప్రాణాలు విడుస్తూంటే, కాంగ్రెసుప్రచారకు లెందువల్ల ప్రజాసేవకు పూనుకోలేదు?.... ప్రజలు కష్టదశలో వున్నపుడు వారికి సాయంచేయవద్దా? అవసరమైతే ప్రభుత్వంతోకూడ కలసి పనిచేయవలసియుంటుంది. కారణం మన స్వాతంత్ర్య యోధుల్ని మృత్యుముఖంనుంచి తప్పించవలసింది మనం."

తరువాత శ్రీమతి సరోజినీదేవి కమ్యూనిస్టులు కాంగ్రెసులో వుండవచ్చునా అనే ప్రశ్నకు సమాధానమిస్తూ యిలా చెప్పింది. "కమ్యూనిస్టుపార్టీనిగురించి మీరింతగా యెందుకు ఆందోళనపడతారు? ఒకపార్టీని శిక్షించవలసిన అవసరమేమి వచ్చింది? కమ్యూనిస్టులు కాంగ్రెసులో తప్పక సభ్యులుగా వుండవచ్చు. వారు కమ్యూనిస్టులైనంత మాత్రాన, వారిహక్కును మీరు లాక్కోకూడదు. కాంగ్రెసు నిబంధనావళిలో మార్పు జరగనంతవరకు కాంగ్రెసు సభ్యత్వ పత్రంమీద సంతకంచేసిన యేవ్యక్తినీ తొలగించడానికి మీకు హక్కులేదు. అధికారహోదాతో నేనీవిషయం చెబుతున్నాను............20 సంవత్సరాల అనుభవంలో మొదటిసారి కాంగ్రెసు ప్రచారకులు ఏమేమో చూచి భయపడుతూన్నట్లు నాకు కనబడుతూంది. ఒకరిని ఒప్పించి మీలోకితీసుకురావలెనుగాని, ఉన్నవారిని దూరంగా తరమడంకాదు మీకర్తవ్యం. అది కాంగ్రెసుపాలసీకాదని గ్రహించండి. పేరుపెట్టి ముస్లింలీగునీ, కమ్యూనిస్టుపార్టీనీ దూరంగా తరమడం మీ మనోదౌర్బల్యాన్ని తెలుపుతుంది. ఆత్మవిశ్వాసంలేదని సూచించుతుంది.........

"కాంగ్రెసు ఒకప్రజాస్వామ్యసంస్థ అని మీరు జ్ఞాపకముంచుకోవాలి. అక్కడక్కడ మీకు ఇష్టులైన స్నేహితుల్ని మాత్రం సభ్యులుగా చేర్చుకునే సంస్థకాదు కాంగ్రెసు. ఎవరు బాగా పనిచేస్తే వారివెనుక ప్రజలుంటారు. మీపనిని నిర్ణయించేది ప్రజలు. అందరికంటే బాగా పనిచేసేవారిని ప్రజలనుసరిస్తారు. కాబట్టి, ప్రతివారు ప్రజలలో పనిచేయవలసివుంది. అపుడు మీరు. సూదంటురాయి యినుమును ఆకర్షించినట్లు ప్రజల్ని ఆకర్షించ గలుగుతారు."

సువర్ణాక్షరాలతో లిఖింపతగిన సరోజినీదేవి మాటలు కాంగ్రెసుసోదరులను ఆలోచించేటట్లు చేస్తాయని నమ్ముతున్నాం. కాంగ్రెసును విశాలమైన ప్రజాస్వామికసంస్థగా నిర్మింపుతారని ఆశించుతున్నాము.

సామ్రాజ్యవాదులు బలపడుతున్నారా?

యుద్ధంలో మిత్రమండలి విజయాలనుచూచి, బ్రిటిషు సామ్రాజ్యవాదులు బలపడుతున్నారని కొందరు దేశభక్తులు భ్రమపడుతున్నారు. ప్రజలను కరువుకాటకాలనుండి రక్షించడానికి, రాజకీయ ప్రతిష్టంభన తొలగించడానికి తాము చేయగలిగినదేమీలేదని నిస్పృహచెందుతున్నారు. ఇండియా మంత్రి, వైస్రాయిల తలబిరుసుమాటలుచూచి విజయాలవల్ల మత్తెక్కిన సామ్రాజ్యవాదులను వంచలేమని నిరాశ చెందుతున్నారు.

ఈ సందర్భంలో సరిహద్దురాష్ట్ర కాంగ్రెసునాయకుడు డాక్టరు ఖాన్‌సాహెబ్ ఏమిచెప్పారో కాంగ్రెసు సోదరులు గుర్తింప ప్రార్థన.

(మిగతా 2 వ పేజీలో)

జనవరి 26 స్వాతంత్ర్య దినోత్సవము

"సోవియట్ విజయాలనుచూచి బ్రిటిషు సామ్రాజ్యవాదులు బలపడుతున్నట్లుగా, జాతీయవాదులమని చెప్పుకునేవారు కొందరు భ్రమపడుతున్నారు. ఈ విషయం నాకు ఆశ్చర్యం కలుగచేస్తూంది. సోవియట్ విజయాలు ప్రపంచమంతటికీ శాంతిస్వాతంత్ర్యాలను చేకూరుస్తాయి. అందుకే బ్రిటిష్ సామ్రాజ్యవాదులుభయపడుతున్నారు. గ్రీసులో బ్రిటీషు సామ్రాజ్యవాదుల కుట్రలు ప్రపంచ మందలి స్వాతంత్ర్యాభిమానుల కళ్లు తెరుస్తున్నాయి. బ్రిటీషుసామ్రాజ్యవాదులు ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యపోరాటాలను ఆటంకపరచలేరు" అని ఖాన్‌సాహెబ్ సెలవిచ్చారు.

అంతర్జాతీయ రాజకీయాలను గమనించితే పైవిషయం తేటతెల్లమవుతుంది. మిత్రమండలి జయించుతున్నమాట నిజమే. అనగా ఫాసిస్టు హంతకులను ప్రపంచప్రజలు ఓడించుతున్నారు. సామ్రాజ్యవాదులు గెలవడంలేదు. ఆక్రమితదేశాల ప్రజలు స్వతంత్రులవుతున్నారు. ఆయా దేశాల ప్రజలపై పెత్తనం బాముకుందామని యత్నించుతున్న బ్రిటీషు సామ్రాజ్యవాదులు ఓడిపోతున్నారు.

ఉదాహరణకు ఫ్రాన్సులో చూడండి। ఫ్రెంచి ప్రజల అభిప్రాయానికి లొంగి, చర్చిల్‌ప్రదావి డీగాల్‌ప్రభుత్వాన్ని అంగీకరించక తప్పలేదు. యుగోస్లేవియా ప్రజలను విజయవంతంగా నడిపి నాజీలను పారద్రోలిన మార్షల్‌టిటో నాయకత్వాన్ని, బ్రిటిషుప్రభుత్వం అంగీకరించలేదా? బెల్జియం ప్రజాభిప్రాయాన్ని తృణీకరించి, నాజీలను దేశంనుండి తరిమిన దేశభక్తులను నిరాయుధులను చేసినందుకు ఫలితంగా శత్రువులచే తన్నులు తినుటలేదా? గ్రీసులో దేశభక్తులకు వ్యతిరేకంగా రాజును, ప్రతీఘాతకులను బలపరుస్తున్నందులకు బ్రిటిషుప్రజలచే చీవాట్లు తినలేదా? దేశభక్తులతో రాజీకి దిగివచ్చుటలేదా? ఫాసిస్టు హంతకులతో పోరాడుతున్నప్రజలు ఐకమత్యంతో తమ శక్తిని ప్రదర్శించి నప్పుడల్లా, బ్రిటిషు సామ్రాజ్యవాదుల నాయకుడు చర్చిల్ వెనుకంజవేయక తప్పడంలేదు.

నాజీల చెరనుండి విముక్తిపొందిన ప్రజలకు వ్యతిరేకంగా చేసే చర్చిల్ చేష్టలను ప్రపంచప్రజలు నిరసించారు. అలాగే ఇండియాలో అమలుజరుపుతున్న చర్చిల్ రాజనీతిని ఆక్షేపించారు. రెండిటి విషయంలోను బ్రిటిషు కార్మిక మహాసభ, (బ్రిటిషు లేబరుపార్టీ) తీర్మానాలుచేసి ప్రజాస్వాతంత్ర్యోద్యమాలను బలపరచింది; అండగా నిలచింది. యూరపులో ప్రజలు జయంపొందుతున్నారు. చర్చిల్ ఓడిపోతున్నాడు.

మనం గెలిచేదెలా?

భారతదేశంలో కూడ అంతే. భారతదేశభక్తులు ఐకమత్యంతో కృషిచేస్తే, ప్రపంచప్రజల స్వాతంత్ర్యపోరాటంలో వారికి తోడుగా నిలబడితే, మనం గెలిచితీరుతాం. చర్చిల్ ఓడిపోతాడు.

కొందరు భ్రమపడుతున్నట్లుగా బ్రిటిషు సామ్రాజ్యవాదులు నేడు బలంగాలేరు. భారతప్రజలలో పలుకుబడి వున్న యెవరూ బ్రిటిషుప్రభుత్వాన్ని నేడు బలపరచుట లేదు. బ్రిటిషు సామ్రాజ్యవాదులు ఏకాకులుగా వున్నారు. బ్రిటిషుప్రభుత్వం భారతదేశంలో నేడున్నంత బలహీనంగా ఎప్పుడూలేదు.

కాని ఐకమత్యం లేకపోవడమే మన ప్రధానబలహీనత. అన్నిపార్టీలకు చెందిన దేశభక్తులమంతా ఏకమైతే మన దేశభవిష్యత్తును మనమే నిర్ణయించుకోగల్గుతాం. అందుకు కాంగ్రెసు-ముస్లింలీగ్ పార్టీలమధ్య ఐకమత్యం పునాదిగా వుండాలి. ముస్లింజాతుల స్వయంనిర్ణయ హక్కును కాంగ్రెసు గుర్తించితేనే యిది సాధ్యమవుతుంది.

అలాగాక కొందరు కాంగ్రెసువాదులే 1935 ఇండియా చట్టాన్ని అమలుజరుపడానికి సిద్ధమై వైస్రాయితో బేరాలకు దిగుతున్నారని వార్తలు ప్రకటించబడుతున్నాయి.

ఈమధ్య వైస్రాయి కలకత్తా ఉపన్యాసంలో భారతదేశానికి శస్త్రచికిత్స అవసరంలేదనీ, బ్రిటనుపై విశ్వాసముంచవలసిందనీ, రాజ్యాంగవిధానంలో ప్రస్తుతం ఎట్టి మార్పు చేయడానికి వీలులేదనీ ఉపదేశం చేయపూనుకున్నాడు. శస్త్రచికిత్సకు, అంటే పాకిస్థాన్‌కు, తాను వ్యతిరేకమని, లీగ్‌కోరికను నిరాకరించాడు. ఈవిధంగా ఒకవైపున లీగ్ - కాంగ్రెసులమధ్య చీలికలను ప్రోత్సహించాడు. రెండో వైపున భారతీయులందరూ కోరే జాతీయ ప్రభుత్వాన్ని నిరాకరించాడు.

కాంగ్రెసువాదులు వైస్రాయి ఎత్తులను అర్థంచేసికోవాలి. ప్రధాన రాజకీయపార్టీలయిన కాంగ్రెసు — లీగ్ వాంఛలను నిరాకరించగల అహంకారం, ధైర్యం, వైస్రాయికి ఎచటినుంచి వచ్చాయి?

కాంగ్రెసు, ముస్లింలీగ్, కమ్యూనిస్టుపార్టీ వగైరా పక్షాలకుచెందిన దేశభక్తులంతా ఏకంగావాలి. ముస్లింజాతుల స్వయంనిర్ణయహక్కు అంగీకరించాలి. వెనుకబడివున్న నిమ్నజాతుల ప్రజల హక్కులను గుర్తించాలి. ఆంధ్రులు, కన్నడులు, వగైరా ప్రజల జాతీయవికాసానికి అవసరమైన స్వయంనిర్ణయహక్కును గుర్తించాలి. ప్రత్యేక రాష్ట్రాలను అంగీకరించాలి. ఈవిధంగా దేశభక్తులందరం ఏకమైతే దేశభవిష్యత్తును మనమే నిర్ణయించుకోగల్గుతాము: ప్రపంచ ప్రజల సాయంతో జయించి తీరుతాము. చర్చిల్, వేవెల్ కంపెనీ తోకముడిచి వెనుకంజ వేయవలసివస్తుంది. ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న జాతీయప్రభుత్వాన్ని స్థాపించుకోగల్గుతాము.

ఆంధ్ర ప్రజల కర్తవ్యం

దేశవాతావరణమంతా యుద్ధానంతరస్కీములతో, ప్లానులతో నిండివుంది. వివిధజాతులప్రజలు తమతమ జాతీయ వికాసాన్ని పెంపొందించుకోడానికి, సంస్కృతిని తీర్చిదిద్దుకోడానికి ప్రయత్నించుతున్నారు. యుద్ధానంతరప్రపంచంలో, స్వతంత్ర భారతదేశంలో ఆంధ్రప్రజలం మనజాతియొక్క సర్వతోముఖాభివృద్ధికి కృషిచేయవలసివుంది.

అందుకు తెలుగు గడ్డపై జీవించే ప్రజలందరం ఐకమత్యంతో ప్రత్యేకరాష్ట్ర నిర్మాణానికి కృషిచేద్దాం. తెలుగుభూమిలో ప్రవహించే నదులకు ఆనకట్టలుకట్టి, వ్యవసాయం వృద్ధిచేదాం. తుంగభద్ర, పోలవరం, మాచ్‌ఖండ్ ప్రాజెక్టుల నిర్మాణంకొరకు ఆందోళన చేద్దాం. ఎరువులు తయారుచేసే ఫ్యాక్టరీని బెజవాడలో నిర్మించాలని ఒత్తిడిచేధాం. ఈవిధంగా తెలుగుభూమి సస్యశ్యామలమై వెలుగొందడానికి కృషిచేద్దాం.

ఆంధ్రదేశం పరిశ్రమలలో వెనుకబడివుంది. తెలుగు భూగర్భంలో వున్న లోహాలనుత్రవ్వి, పరిశ్రమలు నిర్మించడానికి కృషిచేదాం. నదీజల పాతాలనుంచి హైడ్రో-ఎలెక్ట్రిక్ స్కీములద్వారా తయారయేవిద్యుచ్ఛక్తితో బ్రహ్మాండమైన పరిశ్రమలను నిర్మించడానికి ప్రయత్నించుదాం.

ఆంధ్రప్రజలలో యింకా హెచ్చుమంది నిరక్షరాస్యులుగా వున్నారు. వారందరికి చదువు చెప్పించి, విద్యాభివృద్ధి కలుగచేయడానికి కృషిచేదాం. ఉన్నత విద్యాభివృద్ధికై పశ్చిమగోదావరిజిల్లాలో కాలేజీల నిర్మాణానికి ప్రజలు యిదివరకే కృషిచేస్తున్నారు. అట్టి ప్రయత్నాలకు దోహదమివ్వాలి. కాలేజీలు లేని కడప, కర్నూలు జిల్లాలలో కాలేజీల స్థాపనకు తెలుగు ప్రజలందరం పూనుకొని ఆంధ్రజాతీయైక్యతకు పునాదులువేద్దాం.

పై స్కీములు అమలుజరుగడానికి ఇంజనీర్లు తరిఫీదు కావాలి. ప్రజల ఆరోగ్యరక్షణకు డాక్టర్లు కావాలి. ఇందుకొరకు ఆంధ్రదేశంలో ఇంజినీరింగ్ కళాశాలలు, వ్యవసాయకళాశాలలు, వైద్యకళాశాలల నిర్మాణానికి మనమంతా కృషిచేయాలి.

ఆంధ్రజాతీయ వికాసానికి అవసరమైన పైకార్యక్రమం అమలుజరపవలసిన బాధ్యత తెలుగు ప్రజలపై వుంది: ముఖ్యంగా దేశభక్తులందరి ఐకమత్యంపై ఆధారపడివుంది.

కాని అయ్యదేవర కాళేశ్వరరావు, గోగినేని రంగనాయకులు, కల్లూరి సుబ్బారావు గార్లవంటి కొందరు కాంగ్రెసువాదులు ఆంధ్రదేశభక్తులలో చీలికలుతేవడానికి ప్రయత్నించుతున్నారు. రైతు, కూలీ, విద్యార్థిసంఘాలకు పోటీగా తాము సంఘాలను పెట్టి ప్రజావుద్యమాలను చీల్చడానికి ప్రయత్నించుతున్నారు.

గత రెండేండ్లుగా రాయలసీమ కరువునివారణలోనూ, విశాఖ కరువునివారణలోనూ కొందరు కాంగ్రెసు సోదరులు, కమ్యూనిస్టులమూ కలసి ప్రజాసేవచేశాము. ప్రభుత్వం కండ్లుతెరిచేటట్లు చేశాము. రాయలసీమలో 3 కోట్లుదాకా కరువునివారణకు ప్రభుత్వం ఖర్చుపెట్టవలసివచ్చింది. ఇపుడు విశాఖజిల్లాలో అంటువ్యాధుల నివారణకు కమ్యూనిస్టులు, కాంగ్రెసుసోదరులు కలసి పని చేస్తున్నారు.

ఇలాంటి ఐక్యప్రజాసేవను పెంపొందించడం దేశభక్తులందరి కర్తవ్యం. ఇందుకు విరుద్ధంగా ప్రజావుద్యమాలను చీల్చడానికి ప్రయత్నించేవారి చర్యలను నిరోధించాలి. ఇది ప్రజాసేవకులందరికి తండ్రులయిన తెలుగుప్రజల కర్తవ్యం. చైతన్యవంతులైన ఆంధ్ర ప్రజానీకం అలాచేస్తారని ఆశించుతాము.

అప్పుడే తెలుగుప్రజలం ఆంధ్ర జాతీయ వికాసాన్ని పెంపొందించుకొన గల్గుతాము. భారత స్వాతంత్ర్యాన్ని సాధించగల్గుతాము. విశ్వమానవ కల్యాణానికి తోడ్పడ గలుగుతాము.

ఐక్య ఆహారకమిటీలను నిర్మించాలి!
కరువు కాటకాలనుండి ప్రజలను కాపాడాలి!
కాంగ్రెసు నాయకుల్ని విడుదల చేయించాలి!
ముస్లింజాతుల స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరించాలి!
నిమ్నజాతుల కోర్కెలను అంగీకరించాలి!
జాతీయ ఐక్యత నిర్మించాలి!
జాతీయ ప్రభుత్వాన్ని సాధించాలి!
ఫాసిస్టు దురాక్రమణను ప్రతిఘటించాలి!
భారత స్వాతంత్ర్యాన్ని సాధించాలి!
ప్రపంచ ప్రజారాజ్యాన్ని నిర్మించాలి!

"కాంగ్రెసు దేశభక్తులందరిసొత్తు"

లెనిన్ దినోత్సవంనాడు కామ్రేడ్ సుందరయ్య ఉపన్యాసం

21 వ తేది ఉదయం 6 గంటలకు బెజవాడ పౌరులు ప్రభాతభేరీ నినాదాలతో, నేడు లెనిను స్మారకదినమనుకుంటూ నిద్రలనుండి లేచారు. కాంగ్రెసు నాయకులను విడుదల చేయాలి! కాంగ్రెసు - ముస్లింలీగు ఐక్యతతో జాతీయప్రభుత్వాన్ని స్థాపించాలి! చీమూరు, అష్టి కేసులలో ఉరిశిక్ష రద్దుకావాలి! అనే నినాదాలతోను, కార్మిక, కర్షక జాతీయగీతాలతోను, ప్రభాత ఫేరీలు బెజవాడవీధులను మంగళధ్వానాలతో నింపారు. యువజన కార్మికసంఘాలు, కమ్యూనిస్టు ఆఫీసులు, పచ్చతోరణాలతో, ఎర్రజెండాలతో, ముస్లింలీగు జెండాలతో జాతీయ పతాకాలతో అలంకరించబడ్డాయి. పట్టణ కమ్యూనిస్టుపార్టీ ఆఫీసునుండి సాయంకాలం ఊరేగింపు బయలుదేరి, వెలిదండ్ల హనుమంతరాయగ్రంధాలయావరణకు చేరుకుంది. సభకు కామ్రేడ్ పోతరాజు అధ్యక్షుడు.

కామ్రేడ్ సుందరయ్య, లెనిన్ దినోత్సవంనాడు, లెనిన్ ఆశయాలను ఆచరణలో మనదేశంలో కూడా సాధించడానికి తగిన కార్యక్రమం వేసుకోవడమే మన కర్తవ్యమంటూ ఉపన్యాసాన్ని ఆరంభించారు. లెనిను కమ్యూనిస్టుపార్టీసర్థాత, సోవియటు ప్రభుత్వాన్ని నెలకొల్పాడు. ప్రపంచప్రజానీకానికి, ఒక నూతనజీవితానికి, ఒక నూతనసమాజానికి దారిచూపిన మహాపురుషుడు. ఆయన అడుగు జాడలలోనే ప్రతిదేశంలోను కమ్యూనిస్టుపార్టీలు ఏర్పడి తమతమ దేశప్రజల స్వాతంత్ర్యాలను, సౌఖ్యమయమైన నూతన సమాజనిర్మాణానికిపనిచేస్తున్నాయి. సోవియట్‌యూనియన్, లెనిన్ తదనంతరం, కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వాన పోషింపబడి సమాజాన్ని అభివృద్ధి పర్చుకొని బలపడింది. హిట్లరు సైన్యాలను ధ్వంసం చేస్తూవుంది. ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యాన్ని కాపాడింది. నేడు యూరపులో వివిధదేశాలలో దేశభక్తులందరి ఐక్యసంఘటనల నెలకొల్పడానికి కమ్యూనిస్టులుకృషిచేశారు. నాజీసేనల బానిసత్వాన్నుండి తమ దేశీయుల విముక్తికోసం పోరాటాలు జరిపారని వివరించారు.

భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులు గత 25 సంవత్సరాలుగ చేసిన కృషిని వివరించారు. పంజాబు గ్రామసీమలలో 1907 నుండి విప్లవజ్వాలను రేకెత్తించిన వీరులు, గదర్‌పార్టీసభ్యులు, యూరపులో ప్రవాసులయిన బెంగాలు టెర్రరిస్టు వీరులు, 1920 లో బ్రిటిషు బానిసత్వం క్రింద నివసించగూడదని ప్రవాసంవెళ్ళిన మహమ్మదీయ మొజాహిదీలు, భారత కమ్యూనిస్టుపార్టీని మొదట నిర్మించారు. పంజాబు, గురుకాబాగ్ సత్యాగ్రహ సిక్కువీరులు, బబ్బరు అకాలీ ఉద్యమవీరులు చిట్టగాంగు ఆయుధగార వీరులు నేడు కమ్యూనిస్టుపార్టీలో ఉన్నారు. కార్మికోద్యమంలోకి స్వాతంత్ర్య సందేశాన్ని మీరటు కుట్రకేసులోని కమ్యూనిస్టు నాయకులు తీసుకువెళ్ళారు. 1930-34 కాంగ్రెసు సత్యాగ్రహ పోరాటాలలో పాల్గొనినఅనేకమంది కాంగ్రెసుయువకులు, ఆంధ్రలో కమ్యూనిస్టుపార్టీని నిర్మించారు. దేశభక్తుల ఐక్యసంఘటనగా, భారతప్రజలస్వాతంత్ర్యసంస్థగా, కాంగ్రెసుబలపడడానికి గత 10 సంవత్సరాలుగ కృషిచేస్తున్నారు. రైతు, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళాఉద్యమాలల్లో పాల్గొని, ఆంధ్రలో వానిని ఇతరరాష్ట్రాల వారుకూడ మెచ్చుకొనేటంత బలిష్ఠ మొనర్చారు. హైదరాబాదులోని తెలంగానా ఆంధ్రుల ఆంధ్రమహాసభను లక్షసభ్యత్వం గలిగిన మహాసంస్థగ నిర్మించి విశాలాంధ్రప్రజల అభివృద్ధిని పెంపొందిస్తున్నారు.

అట్టి కమ్యూనిస్టులను కాంగ్రెసునుండి తొలిగించాలని ఆంధ్రలో కాళేశ్వరరావు, రంగా, కల్లూరి సుబ్బారావుగార్లు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఆగస్టు ఉద్యమంలో కమ్యూనిస్టులు పాల్గొనలేదు; దానిని వ్యతిరేకించారు. కాబట్టి కాంగ్రెసులో కమ్యూనిస్టులకు స్థానము లేదంటున్నారు. కమ్యూనిస్టులు దీనిని ప్రజాయుద్ధ మన్నారు. యుద్ధానికి సహకారం చేయాలన్నారు. కాబట్టి కాంగ్రెసులో కమ్యూనిస్టులకు స్థానం లేదంటున్నారువీరు. ఆగస్టు ఉద్యమం కాంగ్రెసు ఆరంభించలేదని, అది కాంగ్రెసు కార్యక్రమం కాదని గాంధీజీ, సరోజినీ, ఆజాదులే ప్రకటించారు. యుద్ధానికి సహకారం చేయగూడదని కాంగ్రెసు ఎప్పుడు తీర్మానించిందో చూపమని కామ్రేడు సుందరయ్య సవాలు చేశారు.

సరోజినీనాయుడు అన్నట్లు, కమ్యూనిస్టులు యుద్ధానికి సహకారం చేశారని తీసివేస్తే, మాది సహాయ నిరాకరణ మంటూ, సహాయం చేసినవారిసంగతి ఏమిటి? మైకాగనుల నుండి అభ్రకం తీసినవారు, యుద్ధబాండులను, యుద్ధపరిశ్రమలలో వాటాలనుకొన్నవారు, అట్లుకొనేబ్యాంకులలో డబ్బుదాచుకొన్నవారు, వార్‌కంట్రాక్టుల దీసుకొన్నవారు వీరందరికి కాంగ్రెసులో స్థానమున్నప్పుడు, ప్రజలశ్రేయస్సుకోసం ప్రజలను బలపర్చేటట్టికార్యక్రమంలో పనిచేసిన కమ్యూనిస్టులకు స్థానంలేకపోవడ మేమిటో ప్రజలు ఆలోచించాలి. కాంగ్రెసు యుద్ధానికి వ్యతిరేకం. విధ్వంసక కార్యాలను చేయమన్నదని ఆమెరీ ప్రచారాన్ని ఆగష్టు రోజులలో ఎదుర్కొన్న కమ్యూనిస్టులకు కాంగ్రెసులో స్థానంలేదట! జపాను వస్తేనే స్వాతంత్ర్యం వస్తుంది, అందుచే విధ్వంసక కార్యాలు చేయాలనీ, ఇదే కాంగ్రెసు కార్యక్రమమనీ ఇప్పుడుప్రచారంచేసిన కాంగ్రెసు సోషలిస్టు, ఫార్వర్డుబ్లాకు, రంగాముఠాలవారికి కాంగ్రెసులో స్థానమేమిటో ప్రజలు ఆలోచించాలి.

కమ్యూనిస్టులు వ్యభిచారులని, ఫ్రీలవ్ సొసయిటీలు ఏర్పాటుచేశారనీ, ఇటువంటి తప్పుడుప్రచారాన్ని, రష్యావ్యతిరేక ప్రచారాన్ని రంగా, కాళేశ్వరరావు, కల్లూరి సుబ్బారావు గార్లు చేస్తున్నారు. కమ్యూనిస్టులు, ప్రభుత్వంవద్ద డబ్బు తీసుకుంటున్నారనీ, దేశభక్తులను ప్రభుత్వానికి పట్టించారనీ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి చెత్త ప్రచారాన్ని అవలంబించడంలో వీరిలో ప్రత్యేకతగాని, క్రొత్తగాని ఏమీ లేదు. ఇలాంటిప్రచారం, ప్రజా వ్యతిరేకులంతా, అభివృద్ధి నిరోధకులంతా మార్క్సు రోజులనుండీ చేస్తున్నదే! రష్యాలో సోవియట్ ప్రభుత్వం స్థాపించినప్పుడు కూడ ఇలాంటి ప్రచారాన్ని చేశారు. ఇలాంటి కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారంతో, వెంగమ్మ నాటకాలతో, కమ్యూనిజాన్ని నాశనం చేయగలమనుకోవడం వెర్రితనం. కమ్యూనిజాన్ని ఎవరూ, ఎంతమంది రంగాలు, కాళేశ్వరరావులు కలిసినా, నాశనం చేయలేరు. కాస్త ప్రపంచచరిత్రచూస్తే తెలుస్తుంది!

కాంగ్రెసునుండి కమ్యూనిస్టులను తొలగిస్తే కమ్యూనిస్టులం బలహీనపడతామనే భయంతో కాదు మేము వ్యతిరేకించేది. కాంగ్రెసు ఒక్క కాళేశ్వరరావు రంగాగార్లసొత్తు కాదు. దేశభక్తులందరిసొత్తు. కమ్యూనిస్టుల సొత్తుకూడ. ఏకాంగ్రెసు సంస్థకోసం, ఆంధ్రలో గత 15 సంవత్సరాలుగ మేము అనేక త్యాగాలు చేశామో, గ్రామ గ్రామానికి కాంగ్రెసు సందేశం తీసుకొనివెళ్ళి బలిష్ఠమైన సంస్థగా నిర్మించడానికి కృషిచేశామో, అట్టి భారతప్రజలకు స్వాతంత్ర్యసాధనము, ఆశాజ్యోతిఅయిన కాంగ్రెసు మాసంస్థ. అట్టి మాసంస్థను, ఈరోజు కాళేశ్వరరావు, రంగాగార్లవంటి వారి చేతులలోకి పోనివ్వడమంటే, వారి పాలసీలు కాంగ్రెసులో చెలామణి కావడమంటే:

1. ముందు కమ్యూనిస్టులను కాంగ్రెసునుండి తొలిగించడం। ఆటుపిమ్మట కమ్యూనిస్టులను బలపర్చుతున్నారని ఇతర కాంగ్రెసువాదులను తొలగించడం, ఈరీతిగ కాంగ్రెసును బలహీనపర్చడం.

2. పోటీ రైతు, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు నిర్మించి ప్రజలలో చీలికలు తేవడం.

3. పట్టణ ప్రజలకు, గ్రామప్రజలకు మధ్య తగాదాలు పెంచే రంగా కార్యక్రమాన్ని బలపర్చడం.

4. ముస్లింలీగు, జిన్నా ప్రభుత్వ ఏజెంట్లనే తప్పుడు ప్రచారాన్ని బలపర్చడం. స్వయంనిర్ణయహక్కును, పాకిస్థాను హక్కును గర్హించడం. కాంగ్రెసు - ముస్లింలీగు ఐక్యతను వెనక్కి నెట్టడం. దానితోపాటు మన స్వాతంత్ర్యాన్ని కూడ వెనక్కి నెట్టడం. (మిగతా 10 వ పేజీలో)

===== సంపాదకీయం =====

ఆంధ్రులకు ఆంగ్ల దినపత్రిక

ఆంధ్రప్రముఖులు మద్రాసు విక్టోరియా పబ్లిక్ హాలులో సమావేశమయి ప్రత్యేకంగా ఆంధ్రులకు ఒక ఆంగ్లదినపత్రిక కావాలని తీర్మానించారు. అందుకు అవసరమైన ప్రభుత్వ అనుమతికొరకు ఆంధ్రపెద్దలు కృషిచేస్తున్నట్లుగా కూడ మాకు తెలిసింది.

ఆంధ్రప్రజల జాతీయ ప్రయోజనాలను కాపాడటానికి, ఇతర ప్రజలకు తెలుగు జాతీయసంస్కృతిని తెలియజేయడానికి ఆంగ్ల దినపత్రిక అవసరం. అందుకొరకుచేసే ప్రయత్నాలను తెలుగు ప్రజలు బలపరుస్తారు. అట్టి దినపత్రికకు వెంటనే అవకాశం కలుగజేయాలని ప్రభుత్వాన్ని ఒత్తిడిచేయడం ప్రజల విధి.

ఈ విషయంలో కృషిచేస్తున్న పెద్దలకు మాదొక మనవి. ఆంధ్రుల తరపున నడుపదలచుకొన్న దినపత్రికను మద్రాసులో పెట్టుటలో అర్థంలేదు. మద్రాసులో యితర ఆంగ్ల పత్రికలతో పోటీపడవలసివస్తుంది. ఆంధ్రదేశ కేంద్రమైన బెజవాడలో పత్రికను స్థాపించితే ప్రజలకు వార్తలను మద్రాసు పత్రికలకంటె ముందుగా యివ్వగలుగుతుంది.

ఇంతేగాక దినపత్రిక ఒక విజ్ఞానకేంద్రం వంటిది. విశాలమైన ఆంధ్రావనిలో 3 కోట్ల తెలుగు ప్రజల విజ్ఞానాభివృద్ధికి తోడ్పడాలంటే పత్రిక ఆంధ్రదేశం మధ్యలో ఉండాలి. అందుచే ఆంగ్ల దినపత్రికను బెజవాడలో స్థాపించవలసిందని కోరుతున్నాము.

'ప్రజాశక్తి' దినపత్రిక ఎపుడు?

రైతు, కార్మిక ఉద్యమాలలో పనిచేస్తున్న ప్రజాసేవకులు, మా మిత్రులు ప్రజాశక్తిని దినపత్రికగా ప్రకటించవలసినదని కోరుతున్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఆంధ్రదేశంలోని ప్రజా ఉద్యమాలను చక్కగా ప్రతిబింబించాలంటే ఆంధ్రదేశ కేంద్రంనుంచి ప్రకటించబడే తెలుగు దినపత్రికకు అవసరముంది.

ఈ సత్యాన్ని గుర్తించి మేము 1944లో 'ప్రజాశక్తి'ని దినపత్రికగా చేయడానికి అనుమతి ప్రభుత్వాన్ని కోరాము. కాని ప్రభుత్వం నిరాకరించింది.

ఆంధ్రదేశం మధ్యనుంచి వెలువడే తెలుగు దినపత్రిక యింతవరకు లేకపోవడం విషాదకరం. గుంటూరునుంచి వెలువడుతున్న 'దేశాభిమాని' పత్రిక ప్రభుత్వ నేషనల్ వార్ ఫ్రంటు ఆధ్వర్యాన నడచుటచే అది స్వతంత్రపత్రికకాజాలదు. అదీగాక వార్తాపత్రికగా సైతం ప్రజలకు అది చేస్తున్నసేవ శూన్యం.

అందుచే ఆంధ్రదేశ కేంద్రమైన బెజవాడనుంచి తెలుగు దినపత్రిక ప్రకటించడం అవసరం. అలా నడుపబడే పత్రిక మద్రాసు పత్రికలకంటె ముందుగా తాజా వార్తలను ఆంధ్రప్రజలకు అందజేయగలుగుతుంది. అంతేగాక దినపత్రికలు ఆంధ్ర కేంద్రంనుండి వెలువడితే, అది విజ్ఞానకేంద్రంగా పెంపొందడానికి అవకాశముంటుంది.

1945 లో మరల 'ప్రజాశక్తి' దినపత్రికగాచేయ అనుమతి యివ్వవలసినదిగా మేము ప్రభుత్వానికి అప్లికేషను పెట్టాము. మా ప్రయత్నాలను ఆంధ్రప్రజలు బలపరచాలని కోరుతున్నాము. ఆందోళనచేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారని ఆశించుతాము. ప్రజలు చేసే సహాయం, ఆందోళనపైనే 'ప్రజాశక్తి'ని దినపత్రికగాచేసే ప్రయత్నాలసాఫల్యత ఆధారపడి వుంటుందని మనవి చేస్తున్నాము.

విశాల జాతీయసంస్థగా కాంగ్రెసు నిర్మించబడాలి!

సంకుచితదృష్టి దేశాభ్యుదయానికి హానికరం

పత్రికావిలేఖరుల సభలో శ్రీమతి సరోజనీదేవి ప్రసంగం

●

[ఈ నెల 18 వ తేదీ ఉదయం మైలాపూరు రసికరంజనిసభలో ఏర్పాటు చేయబడిన పత్రికా విలేఖరుల సభలో శ్రీమతి సరోజనీ నాయుడు 1½ గంటలసేపు ప్రసంగించారు. సుమారు 50 మంది పత్రికా విలేఖరులు సభకు హాజరైనారు. నేడు మనదేశ ప్రజలందరిని ఆందోళనపరుస్తున్న క్లిష్టసమస్య లన్నింటిని గురించి ప్రశ్నలవర్షం కురిసింది. కాంగ్రెసు అసెంబ్లీకార్యక్రమం, కాంగ్రెసు-కమ్యూనిస్టు సంబంధాలు, కాంగ్రెసు సభ్యత్వ అర్హత, కాంగ్రెసు-లీగు ఐక్యత, దేశభవిష్యత్తు, మొదలైన విషయాలన్నీ చర్చలలోకి లాగబడినవి. శ్రీమతి సరోజనీనాయుడు అతిసహనంతో అన్ని ప్రశ్నలకు సమగ్రమైన సమాధానాలు ఇచ్చారు. అందరూ సంతృప్తిపడిన తరువాతనే సభ ముగిసింది. శ్రీమతి సరోజనీదేవిగారి సమాధానాల సారాంశాన్ని ఈ క్రింద ప్రకటిస్తున్నాం.]

జైళ్ళనుంచి విడుదలై వచ్చిన కాంగ్రెసువాదులు ఏర్పాటుచేస్తున్న కాంగ్రెసు అసెంబ్లీలన్నీ తాత్కాలికసంస్థలు మాత్రమేనని మీరు గుర్తించాలి. కాంగ్రెసు కమిటీలన్నీ తిరిగి పునరుద్ధరించబడేవరకూ, మనదేశ ప్రజలకు తోడ్పడే నిర్మాణ కార్యక్రమాన్ని కొనసాగించటమే ఈ సంస్థల ఆశయం. కాంగ్రెసు నిబంధనావళి ప్రకారం కాంగ్రెసు కమిటీలకుగల హక్కులను ఈ అసెంబ్లీలు హరించలేవు. కాంగ్రెసు సభ్యత్వ అర్హతలను గురించిగాని, మరి ఏ ఇతర అర్హతల గురించిగాని, నిర్ణయించే అధికారం ఈ అసెంబ్లీలకులేదు. కాంగ్రెసు కమిటీలు నిషేధంలో ఉన్నంత వరకూ అటువంటి ప్రశ్నలకు అవకాశంలేదు.

నిర్మాణ కార్యక్రమం కొరకు ఏర్పాటు చేయబడుతున్న ఈ అసెంబ్లీలయొక్క హద్దులను కాంగ్రెసువాదులందరూ ముఖ్యంగా గుర్తించాలి. కాంగ్రెసు అసెంబ్లీలద్వారా ఏ ఒకవ్యక్తినిగాని, పక్షమునుగాని కాంగ్రెసునుంచి తొలగించే ఉద్దేశ్యంతో చేయబడే ప్రకటనలన్నీ పొరపాటు వ్యాఖ్యానాలు.

నిర్మాణ క్రమం - దానిహద్దులు

నిర్మాణ కార్యక్రమం అంటే కేవలం నూలువడుకుట, ఖద్దరు ధరించుట మాత్రమే అని భావించుట తప్పు. ఎంతో వెనుకబడి ఉన్న మన దేశంలో ప్రజలందరిని దేశభక్తిపూరితులుగానూ, చైతన్యవంతులుగాను, విజ్ఞానవంతులుగానూ చేయుటకై విశాలమైన దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని సాగించవలసియున్నది. హరిజనులు, మహమ్మదీయులు, ఇండియన్ క్రిస్టియన్లు మొదలైనవారిలో అధికసంఖ్యాకులు ఇంకా కాంగ్రెసుకు దూరంగానే ఉన్నారు. ప్రస్తుతం వారిలో కొద్దిమందిమాత్రమే నామమాత్రంగా కాంగ్రెసులో ఉన్నారు. వారి ప్రత్యేక హక్కులనుపాటిస్తూ,వారందరినిగూడా కాంగ్రెసులోకి తీసుకొనివచ్చుటకై మన మందరం కృషి చేయాలి.

ఈ కార్యక్రమంలో కలిసివచ్చేవారందరి సహకారం కాంగ్రెసువాదులు తీసుకోవాలి.

దేశభక్తి సొంతసొత్తుకాదు

'దేశభక్తి' అనేది ఎవరి సొంత సొత్తూ కాదు. మేమే దేశభక్తులమని ముఠాలుకట్టడం దేశాభ్యుదయానికి హానికరం. దేశభక్తిగల భారతీయులలో అనేక దృక్పథాలు ఉండవచ్చును. దేశానికివెన్నెముక అయిన ప్రజల యొక్క విజాయితీమీద నేను ఆధారపడుతున్నాను. కాంగ్రెసునుంచి దూరంగా ఉన్న వారందరి దృక్పథాన్ని అర్థంచేసుకొని, వారందరిని (ఉదాహరణకు నిమ్నజాతుల వారిని) జాతీయోద్యమంలోకి తీసుకొనివచ్చే విశాల జాతీయదృక్పథంతో పనిచేయాలి.

నేను చెప్పేది కాంగ్రెసు సాంప్రదాయానికి విరుద్ధంకాదు. కాంగ్రెసు చరిత్ర ఈసత్యాన్ని నిరూపిస్తోంది. చూడండి: నేను చిన్నపిల్లగా ఉన్నప్పుడు కాంగ్రెసు సంస్థ ఎలా ఉన్నదీ, ఇపుడు ఎలా వృద్ధిఅయిందీ తలచుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ఎప్పుడో 50 సంవత్సరాలక్రితం కాంగ్రెసు మహాసభ ప్రారంభమైనప్పుడు ఆనాటి సభలలో God save the king (రాజుగారిని భగవంతుడు రక్షించుగాక) అనేపాట పాడుతుండేవారు. బ్రిటిష్‌వారి దయాధర్మాలమీద ఆధారపడి కొన్ని హక్కులకొరకు విన్నపాలుచేసే రోజులవి.

తరువాతలోకమాన్యతిలక్ "ఒకరుఇవ్వాలి" అనేమాట వదలి "మేమే తీసుకుంటాము" అని స్వరాజ్య సంపాదనకై స్వయంకృషి మార్గాన్ని ప్రవేశపెట్టాడు. 1920 లో మహాత్ముడువచ్చి, సామాన్య ప్రజాబాహుళ్యాన్ని కాంగ్రెసులోకి తీసుకువచ్చి దాన్ని బలమైన జాతీయప్రజాసంస్థగా కాంగ్రెసును నిర్మించాడు. "కాంగ్రెసు ప్రజలది. ప్రజాసంస్థగా నిర్మించండి" అన్నాడు. ఆవిధంగా అనేకయేరులు, పాయలు అన్నీకలసి పెద్ద ప్రవంతిగా ప్రవహించింది. నానాటికి విశాలవంతంగా వృద్ధి అవుతూవచ్చిన ఈ ప్రవాహాన్ని ఎవరూ అడ్డుకొవలేరు. దాన్ని సంకుచితపరచాలనిచూచుట దేశాభ్యుదయానికి హానికరం. ఈప్రవాహంలో అనేకపక్షాలు వచ్చిచేరి ప్రజా ఉద్యమాన్ని బలపరచినాయి. ఈ ప్రజాస్వామిక సాంప్రదాయమే కాంగ్రెసుయొక్క బలం అని మనందరం గుర్తించాలి.

సభ్యత్వ అర్హత

కాంగ్రెసు సభ్యత్వ అర్హతను గురించి నేను కలకత్తాసభలలో స్పష్టపరిచాను. దాన్ని గురించి ఇంకా కొందరు వ్యాఖ్యానాలుచేయుట శోచనీయంగావుంది. ఈక్రింది విషయాన్ని స్పష్టంగా తెలుసుకోండి.

కాంగ్రెసునిబంధనావళిప్రకారం 18ఏండ్లకు పైన వయస్సుగలవారు ఎవరైనాసరే కాంగ్రెసు ప్రణాళికమీద సంతకంచేసి, 4 అణాల రుసుము చెల్లిస్తే, కాంగ్రెసుసభ్యులుగా ఉండవచ్చును. ఈ సత్యానికి వ్యతిరేకంగా కాళేశ్వరరావుగాని, పటేల్‌గాని, కిరణ్‌శంకరరాయ్‌గాని, ముత్తురంగంగాని, మరి ఎవరైనాగాని, ఈప్రాథమికహక్కును తీసివేయలేరు. కాంగ్రెసు ప్రణాళిక మారనంతవరకు, అఖిల భారత కాంగ్రెసుకమిటీ ప్రణాళికలోమార్పులు చేయనంతకాలం ఈ సూత్రమే వర్తిస్తుందని స్పష్టంగా గ్రహించండి.

కమ్యూనిస్టులపై నిందలు

కమ్యూనిస్టులు ఆది చేశారని, ఇది చేశారని కొందరు తెలివితక్కువ ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వంనుంచి డబ్బు తీసికొంటున్నారని, అవినీతిపరులని, కాంగ్రెసు వ్యతిరేకులని, నిరాధారమైన నిందలు వేస్తున్నారు. ప్రజలను ఆకర్షించుటకు నృత్యాలు-నాట్యాలుచేస్తారని నిందించడంలో అర్థంలేదు.

మాట మాట్లాడితే కమ్యూనిస్టుల పేరు చెప్పి బెదురుతారెందుకు? కమ్యూనిస్టులు ఏంచేశారు? వారి దృక్పథం ప్రకారం వారు నిలబడి పనిచేస్తున్నారు. కాంగ్రెసులో వారికిగల హక్కును ఎవరూ తీసివేయలేరు. కాంగ్రెసులో దేశభక్తులందరితోపాటు వారికి గూడ స్థానం వుంది.

ప్రభుత్వంతో సహకారం చేస్తున్నారనుట పొరపాటు. సహకారం అంటే ఏమిటి? పత్రికలు యుద్ధవార్తలను ప్రకటించుటలేదా? అదికూడ యుద్ధానికి, బ్రిటిషు సామ్రాజ్యానికి తోడ్పడుట కాదా? అని సరోజనీదేవి ఎదురు ప్రశ్న వేసింది.

"ఇక నిందలవిషయం. కమ్యూనిస్టులను నేను బాగా ఎరుగుదును. బొంబాయిలో కమ్యూనిస్టులను చిన్న బిడ్డలుగా ఉన్నప్పటినుంచి నేను ఎరుగుదును. వారు ఎలాపెరిగిందీ, వారి దేశభక్తిని గురించి నాకు బాగాతెలుసును. నా స్నేహితులు, కాంగ్రెసు ప్రముఖ నాయకులుగా ఉన్నవారి బిడ్డలైన కమ్యూనిస్టు లెందరో ఉన్నారు.

వారియొక్క పట్టుదల, శిక్షణ, నిర్మాణం, ప్రజాసేవను గురించి నేను ప్రశంసించక తప్పదు. నీతి నియమాలవిషయంలో వారు శిక్షణతో అనుసరించే అనుపమాన నైతికజీవితంప్రశంసనీయమైనది.

ఇక వారి నృత్యాలను గురించి: నిజమే. బెంగాలు కరువునుగురించి ప్రజలను ఉత్తేజపరుస్తూ కమ్యూనిస్టులు ప్రదర్శించే 'మృత్యు నృత్యాలను' (Death Dances) నేను చూశాను. వేలకొలది డబ్బువసూలుచేసి కరువుబాధితులకు సహాయం చేయుటయేగాక లక్షలకొలదీ ప్రజలను ఉత్తేజపరచారు. ప్రజాసేవకై వారుచూపించేఉత్సాహం, పట్టుదలఅపమానమైనదని చెప్పక తప్పదు. వారియొక్క ప్రజాసేవ హక్కును ఎవరుతొలగించగలరు? వారు చేసే కృషిని ప్రశంసించే బదులు, వారిమీద నిందలు వేయుటయే కార్యక్రమంగా పెట్టుకొనుట సంతోషకరమైన విషయంకాదు.

కమ్యూనిస్టులంటే ఎందుకీభయం? యూరపులో బోల్షివిక్ పెనుభూతమని సామ్రాజ్యవాదులు ప్రచారంచేశారు. మళ్ళీ యిక్కడ కూడానా? రంగు వేసుకొని బోల్షివిజం వ్యాపిస్తూందనే ప్రచారం నెగ్గదు. జాతీయోద్యమంలో ఏపక్షం మీదనైనాసరే ఆధార రహితమైన నిందలు వేయుట దేశాభ్యుదయానికే హానికరం.

కాంగ్రెసు - లీగు ఐకమత్యం

ఈసమస్యను గురించి ఒకటి మాత్రం అందరూ స్పష్టంగా గుర్తించాలి. కాంగ్రెసు-లీగుల మధ్య సమాధానంలేకుండా మనదేశం, మన జాతీయోద్యమం ఒక అడుగుకూడా ముందుకు వేయలేదు. ఈసమాధానంకొరకు మనమందరం నిరంతరకృషి చేయాలి. ఎంత త్వరగా సమాధానం కుదిరితే అంత త్వరగా మన స్వాతంత్ర్యం లభిస్తుంది.

అయితే ఈ సమాధానం కొరకు ఒక పక్షంవారు మరొకపక్షంయొక్క దృక్పథాన్ని అర్థంచేసుకోడానికి ప్రయత్నించాలి.

అంతేగాని ముస్లింలీగు బ్రిటీషుప్రభుత్వం చేతులలో కీలుబొమ్మ అని నిందించుటతగదు: అలాచేయడం బుద్ధిహీనతనుతెలియజేస్తుంది.

ఒండొరుల అభిప్రాయాలు ఏకీభవించనంతమాత్రాన, ఆధారరహితమైన ఆరోపణలు చేయడం సిగ్గుచేటు. ఈ మధ్య ఒకరు జిన్నాగారిపై నిందలువేస్తూ, నా యెదుట మాట్లాడాడు. వాచాలతకు అతనిని నేను మందలించాను. భారతదేశమంతటిలోను జిన్నా అగ్నివలె కలుషితం చేయబడజాలనివ్యక్తి. నేనుఆయనతోఏకీభవించకపోవచ్చు. కానిపదవి.లేకబిరుదు, మరి యే యితర వ్యామోహం వల్లగాని, బ్రిటీషు ప్రభుత్వానికిగాని, మరెవరికిగాని, అమ్ముడు పోని ఆదర్శవ్యక్తి ఎవరైనా వుంటేఅతడు మహమ్మదాలీ జిన్నా అని నా నిశ్చితాభిప్రాయం.

ఇక మూడో పార్టీ ఉన్నంతకాలం సమాధానం కుదరదని కొందరు చెప్పేవాదం నాకు తలనొప్పి కలిగిస్తోంది: మన మధ్యగల భేదాలకు మనమే బాధ్యులం. సమాధానానికి కూడ మనమే బాధ్యులం-మూడోపార్టీమీద బాధ్యత వేసి ఆత్మ సంతృప్తి చెందడంవల్ల దేశానికి మేలుకలుగదు.

ముస్లిముల ఆశయం స్వాతంత్ర్యమే. భారతీయులందరుకోరేగమ్యస్థానంస్వాతంత్ర్యమే. దీన్ని కూడసందేహించడం ఆత్మహత్యాకరం. అయితే మహమ్మదీయుల దృక్పథాన్ని అర్థం చేసికొనుటకై మనందరం యింకా వారితో కలిసిమెలసి చర్చలు సాగించి, మన దృక్పథానికిగల భేదాలు తొలగించుకోడానికి ప్రయత్నించాలి.

జిన్నా ఈ మధ్య పత్రికా విలేఖరులతో మాట్లాడాడు. అనేక విషయాల్లో మనతో ఏకీభవిస్తాడు.

ఆయన జగత్‌నారాయణలాల్ తీర్మానం ఉపసంహరించాలన్నాడు. ఈ విషయం నేను స్పష్టం చేస్తున్నాను. కాంగ్రెసు అంగీకరించిన స్వయంనిర్ణయ సూత్రాన్ని జగత్‌నారాయణ తీర్మానం రద్దుచేయలేదు. కాంగ్రెసు స్వయంనిర్ణయ సూత్రాన్ని స్పష్టంగా అంగీకరించింది.

సంయుక్త మంత్రివర్గాలు

మరొక ముఖ్యవిషయం "కాంగ్రెసు మంత్రివర్గాలు" అనే నినాదం అక్కడక్కడ ముందుకు వస్తోంది. ఈ విషయం మద్రాసు కాంగ్రెసువాదులు ముఖ్యంగా గుర్తించాలి. ఈసారి జాతీయ (మిగతా 8 వ పేజీలో)

★



దాపులూరు (గుంటూరుజిల్లా)లో కమ్యూనిస్టుపార్టీ నిధికి రైతులు - కూలీలు వరికోత కోయుచున్న దృశ్యం

ధాన్యలక్ష్మి

— నార్ల చిరంజీవి

నన్నొదిలిపెట్టైళ్ళినా? నా రైతా!
ఎన్నికడగళ్ళు కన్నారా!

మాయదారిబేరి
మాయలో పడిపోయి
అన్నదాతా - నీవు
నన్నమ్మికొన్నావ?

నీ చేతి చలవకై
నిలిచి చూచే జీవి
ఒరిగిపోయేరీతి
యెరుగవా నా తండ్రి!

చీకటి లోయలో
చిక్కుకున్నానోయి
కలవారలే నన్ను
కదిలించగలరోయి—

నను దాచి దేశాన్ని
నలిచివేశారన్న!
కరువు రాకానికే
కళ్ళుమొదిలారన్న!

పొరుగు పల్నాటిలో
ఇరుగు వైశాఖలో
వేలాది నీ ప్రజలు
నేలకొరిగారన్న!

పండి వారిగిన నేను
పయనమై యున్నాను
కడుపుకాలిన ప్రాణి
కనువిప్పుతున్నాది!

తిండి దొంగలగుంపు
తొంగిచూస్తున్నాది
ఆదుకున్నా పంట
అందనీ బోకోయి

జాతిముక్తికి నీవు
వైదోడువోయన్న!
స్వాతంత్ర్య సమరాన
పగపాలు నీదన్న!

విజయసాధన కింక
వేవేగ పదుమన్న!
కనుమూసి కూర్చుంటె
కలకాల దాస్యమ్మె!-


నీ మిగులు ధాన్యాన్ని
నిరుపేద కందించి
నీ జాతి ధర్మాన్ని
నెరవేర్చుకొనుమన్న-

నన్నొదిలిపెట్టైళ్ళకోయీ నా తండ్రి!
అన్నార్తున కందింపవోయీ!



" అనాథ "

విజయనగరం అంటిపసత్రంవద్ద



కొక్కిరపాడు, వేంపాడు (పశ్చిమగోదావరి) గ్రామాలలో పార్టీసభ్యులు, రైతు - కూలీసంఘాల సభ్యులు, బాలసంఘంవారు కలిసి పార్టీనిధికి వరికోతల్లో పాల్గొన్నదృశ్యం

★ 8 వ ఆంధ్రరాష్ట్ర రైతుమహాసభ

మార్చి 30, 31 తేదీలలో

8 వ ఆంధ్రరాష్ట్ర రైతుమహాసభ దుగ్గిరాల (గుంటూరు జిల్లా)లో మార్చి 30, 31 తేదీలలో జరుపుటకు నిశ్చయింపబడింది. మహాసభకు విరివిగా ధన, వస్తు రూపేణ విరాళాలిచ్చి, ఇతరత్ర సహాయపడి, జయప్రదం గావించవలసినదిగా జిల్లా రైతాంగమును కోరుచున్నాము.

ఆహ్వానసంఘ ఆర్గనైజింగుకమిటీ

కొల్లా వెంకయ్య (కన్వీనరు)
వాసిరెడ్డి శివలింగప్రసాద్ (కోళ్ళాదివరి)
రావి సత్యనారాయణ (తెనాలి)
జంపాల వంగయ్య (దుగ్గిరాల)
కోగంటి కోటయ్య (దావులూరు)
మాతక్కి వెంకటనారాయణ (చిలుమూరు)
రావర్ల శివయ్య (అమృతలూరు)
గుమ్మడి వీరయ్య (కొల్లూరు)
రావి చినఅమ్మయ్య (తెనాలి)
చుక్కపల్లి నరసయ్య (కంచెర్లపాలెం)
మద్దుల వెంకట్రామయ్య (దుగ్గిరాల)
పిడికిటి శీతారామయ్య (గుండిమెడ)
గుర్రం లక్ష్మయ్య (పొన్నెకల్లు)
పోదెల నరసింహారావు (పెదమద్దూరు)
ఆలూరి లింగయ్య (తుళ్లూరు)
ఆకుల నారాయణస్వామి (తాడికొండ)
పూసం రామిరెడ్డి (నంబూరు)
కొత్తపల్లి కృష్ణమూర్తి ఎం. బి. బి. ఎస్ (రేపల్లె)
ఘంటా సూర్యప్రకాశరావు (గూడవల్లి)
దేవినేని చెంచయ్య (గొరిగెపూడి)
దొంతు నాగయ్య (రాజోలు)
ప్రత్తిపాటి చినఅంకమ్మ (నర్సాయపాలెం)
పెద్ది జానకిరామయ్య (పాలపర్రు)
వాసిరెడ్డి చినరామయ్య (కోమూరు)
ఎండూరి బాలకోటిరెడ్డి (మాదల)
నల్లపాటి ఆంజనేయులు (జొన్నలగడ్డ)
కొమ్మారెడ్డి మల్రెడ్డి (రెంటచింతల)
తురిమెళ్ల శీతారామయ్య (దొండపాడు)
గోగినేని న్యాషాభక్తరాజు (ఉప్పుగుండూరు)
పాటిబండ్ల రంగనాయకులు (భీమవరం)
కాదోటు రామస్వామి (జిల్లా వ్యవసాయ కూలీసంఘ అధ్యక్షుడు)
వం. మల్లిఖార్జునశర్మ (జిల్లా వ్యవసాయ కూలీసంఘ కార్యదర్శి)
మహబూబ్‌ఖాన్ (జిల్లా ముస్లింలీగ్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి)
ఎం. వి. సుబ్బారావు (జిల్లా యువజన సంఘ కార్యదర్శి)
కాకుమాని కోటమ్మ (జిల్లా మహిళాసంఘ అధ్యక్షురాలు)

ఆహారసమస్య ప్రభుత్వ అవకతవకలు

— కడియాల గోపాలరావు.
(అధ్యక్షుడు, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం)

ఆహారసమస్యా పరిష్కారానికి ప్రభుత్వం అవలంబించేపద్ధతులు లోపభూయిష్టంగా వున్నయి. పరిస్థితి కాస్త చక్కబడివట్లు కనబడితే నిర్లక్ష్యంగా ప్రవర్తించడమూ, కాస్త విషమించితే గాభరాపడటమూ ప్రభుత్వానికిపరిపాటైంది. దీనికి కారణమేమంటే: ప్రజల సహకారం తీసుకోకపోవడమూ, ప్రజాసంస్థల సూచనలను అధికార గర్వంతో చూడడమూ, కారణాలు తనకు తోచవు: ఇతరులమాట వినదు. గత రెండుసంవత్సరాల అనుభవంలోనూ ప్రభుత్వపద్ధతి యీవిధంగా కనబడుతోంది.

మనము రాష్ట్ర రైతుసంఘము తరపున ఎప్పటికప్పుడు ఆహారసమస్య పరిష్కారానికై ఆచరణయోగ్యమైన సూచనలు యిస్తున్నాం. మనము యిచ్చే సూచనలు ఆచరణలో పరిమైనవని రుజావుచేస్తున్నాం. ఇటు అదనపుజిల్లాలలోనూ, అటు తరుగు ప్రాంతాలలోనూ, ఇటు పట్టణాలలోనూ, అటు పల్లెప్రాంతాలలోనూ, వరిధాన్యాన్నీ, జొన్నలు వగైరా మెట్టధాన్యాలనూ, సేకరించడానికి, పంచడానికి సమగ్రమైనప్లాను యిచ్చాం.

ప్రభుత్వం దొంగవ్యాపారులకు లొంగగూడదు

కాని ప్రభుత్వం ప్రజాదోళన బలంగా వున్నప్పుడు ప్రజాప్లానును అమలు జరుపడానికి ప్రారంభిస్తూ ముందుకురావడం; మిల్లు యజమానుల, దొంగవ్యాపారుల బెదరింపుల వల్ల, స్థానికాధికారుల లంచగొండితనమువల్ల, జిల్లా అధికారుల బాధ్యతారహిత ప్రవర్తన వల్లా వెనుకంజ వేయడమూ, ప్రతిసమస్యలోనూ ప్రతిబింబిస్తోంది. రాయలసీమజిల్లాలలో మెట్టధాన్యాల సేకరణ విధానాన్ని పెద్దపెట్టున ప్రారంభించింది. కాని తొలిలోనే తుస్సుమనిపించింది. ప్రభుత్వం తానే స్వయంగా ⅛ వంతు ధాన్యమైనా కొంటానంది. కాని ఒక్క గింజకూడా కొనకుండా అధికలాభం ధ్యేయంపై ఆధారపడింది. రైతులే బియ్యాన్ని యివ్వవచ్చునంది. కాని చివరకు మిల్లుయజమానులకు, దొంగవ్యాపారులకు లొంగి, రైతులు బియ్యాన్నిచ్చే అధికారం లేకుండా చేసింది. అవసరమైతే మిల్లులను కమాండీరు చేస్తానంది. కాని అది మాటలలోనే ఊగిపోయింది. గత సంవత్సరపు అనుభవమువల్ల రైతులకు యింకా ఎక్కువరేటు యివ్వవచ్చునని అంగీకరించినా, ఆచరణలో గతసంవత్సరముకంటె తక్కువ ధరలకు కొనడానికి వీలుగా, వర్తకుల స్వేచ్ఛావిహారానికి మార్కెటును వదలివేసింది. ప్రభుత్వం యీ విధంగా ప్రవర్తించడానికి రాష్ట్రంలో ఈనాడున్న పరిస్థితి ఏమిటి? గత సంవత్సరం కంటె కృష్ణా, గోదావరి డెల్టాలలో పంట తక్కువని ప్రభుత్వమే అంగీకరిస్తోందిగదా? మరి ఎందుకీ నిర్లక్ష్యము?

కంట్రోలు ధరకే ధాన్యం సప్లయి కావాలి

రాయలసీమలో మెట్టధాన్యాలకు జిల్లాకొక ధర వుంది. ధాన్యసేకరణ విధానం క్రింద సేకరించిన ధాన్యం ఎక్కడికి పంపాలో రైతెవ్వరికీ దారులకు తెలియజేయలేదు. గత సంవత్సరం సేకరించిన ధాన్యం కొన్నిచోట్ల ముక్కిపోతున్నది. తరుగు గ్రామాలలో ప్రజలు ధాన్యంలేక ఎక్కువధర పెట్టి కొనుక్కోవలసివస్తోంది. రాయలసీమ జిల్లాలలోని మిగులు గ్రామాలలో కొనేదిక్కు లేదు. రైతెవ్వరీకిధర్లు కొవడంలేదు. అదవాకొంటే, కంట్రోలు ధరకంటే బాగా తగ్గించి కొంటున్నారు. జిల్లాలో పరిస్థితి యిలా వుండగానే, యితర జిల్లాలనుండి తెప్పించిన జొన్నలు గోడౌన్సులో చెడిపోతున్నాయి. వాటిని ప్రజలు అక్కర్లేదంటే, బియ్యం యివ్వమంటున్నారు. ముక్కిన జొన్నలను పుచ్చుకుంటేనే బియ్యం యిస్తున్నారు, లేకపోతే బియ్యం యివ్వరు. ఈవిధంగా మెట్టధాన్యానికి బియ్యానికి ముడిపెడుతున్నారు. ఇతరజిల్లాలనుండి తెప్పించేముందు రాయలసీమ జిల్లాలలో ఉత్పత్తి ఎంతవుంటుందో అంచనావేసి, ఆ జిల్లాలలోనే మిగులు ప్రాంతము నుండి అంచనా ప్రకారం మిగులు ధాన్యాన్ని సేకరించి తరుగుప్రాంతాలకు సర్ది, యింకా అవసరమైన ధాన్యాన్ని మాత్రమే యితర జిల్లాలనుండి తెప్పించక పోవుటచే అనేక చిక్కులు వస్తున్నాయి. ఈ సంవత్సరం రాయలసీమ జిల్లాలలో పంటలు ఫలించాయి. అందుచేతనే సంవత్సరంనుండి అమలుపరుస్తానని ప్రయత్నంలోవున్న "లెవీసిస్టం"ను రద్దు పరచింది ప్రభుత్వం. మార్కెటులో వ్యాపారులు ఆడింది ఆట, పాడిందిపాట. ఆ కాస్తపంటా మాయమవుతుందంటే ఆశ్చర్యంలేదు. నెల్లూరు, కృష్ణ, గుంటూరు, గోదావరిజిల్లాలలో జొన్నలు టెండరుపద్ధతిపై సేకరిస్తామన్నారు. ఆ పద్ధతివల్లవచ్చే దుష్ఫలితాలను ఎత్తిచూపాం. కాని ఏ పద్ధతి కూడా ఇంతవరకూ అమలుజరుగలేదు.

ప్లానుప్రకారం పంపకం జరగాలి

పంపకములో కూడా అంతులేని అరాజకత్వం ఉంది. ఉదాహరణకు, బెజవాడ సెంట్రల్ స్టోర్సుకు గోధుమలువచ్చి రెండుమాసాలైనది. కాని విడుదలకు అనుమతిలేక చెడిపోతున్నాయి.

విశాఖ జిల్లాలో ప్రభుత్వం గ్రామాలకు కూడా రేషనింగు ఒకవిధంగా అమలు జరుపడం, ఉచితభోజనశాలలు పెట్టడం సంతోషించదగినవుంది. కాని ఆ జిల్లాలోనే, ధాన్య సేకరణ విధానము ప్రభుత్వం ప్రవేశపెట్టిందొకటి: తహశ్శీల్దారు అర్థంచేసుకున్నదింకొకటి. గ్రామాలలో మునసఫ్, కరణాలు టముకు వేయించేది మరొకటి. మునసఫ్ కరణాలు, రివెన్యూ ఇన్‌స్పెక్టర్లూవేసే పంటల అంచనాలకూ, నిజంగా పండే పంటకూ సంబంధంలేదు. తప్పుడు లెక్కలనూ, లంచగొండితనాన్నీ అరికట్టడానికి ప్రయత్నించే రైతుసంఘ వలంటీర్లను ఆ ప్రాంతమునుండి వెళ్ళగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు స్థానిక అధికారులు.

1944–45 సంవత్సరపు ఆహారప్లానును, పరిస్థితిని, దాని గతికి దాన్ని వదలివేసింది ప్రభుత్వం. ప్రజా సహకారము వాంఛించని ప్రభుత్వం వ్యాపారస్తులకు, మిల్లు యజమానులకు లొంగిపోయింది. అప్పుడే దీని దుష్ఫలితాలు కనిపిస్తున్నాయి. కొను కొనవంటూ, రంగాన్ని దొంగవ్యాపారస్థులకు వదలివేసింది. గతసంవత్సరముకంటే ధాన్యానికి హెచ్చుధరలు యివ్వవచ్చునని మాటను ప్రకటించింది. బియ్యపు దిగుబడి ఎక్కువవస్తుందని అంగీకరిస్తోంది. మిల్లింగు రేటు, సంచిరేట్లు తగ్గించి రైతులకే అఫలితాన్ని అందజేయవచ్చునని అంగీకరించింది. ఇవన్నీ, ప్రభుత్వం కొన్నప్పుడే యిస్తుంది. కాని ప్రభుత్వం కొనదు. బియ్యపుధర నిర్ణయించింది. కాని వడ్లధర నిర్ణయించలేదు.

ప్రభుత్వమే ధాన్యాన్ని న్యాయమైన ధరకు కొనాలి

కొత్తపంటలు వచ్చాయి. య 1 కి రెండు బస్తాలనుంచి 6 బస్తాలవరకూ పంటలు తగ్గినట్లు తెలుస్తోంది. వ్యాపారస్తులు ధాన్యాన్ని 160 పౌనుల బస్తా 1 కి రు. 10-1-0 నుండి రు. 10-4-0 వరకూ పెట్టి కొంటున్నారు. రైతులు నిస్పృహతో యిక గత్యంతరం లేక వ్యాపారస్తులకు తెగనమ్ముతున్నారు. శిస్తులు, అప్పులు వగైరా అవసరాలకై రైతులు ధాన్యాన్ని విధిగా పంటకళ్ళాలలోనే అమ్ముకుంటారు. అందుచేత వ్యాపారస్థుల చేతులలోకి అప్పుడే లక్షలకొలదిబస్తాలుపోయాయి. గతసంవత్సరం జిల్లాకలెక్టర్లు నిర్ణయించిన రేట్లువల్ల రైతులకు బస్తా 1 కి రు. 10-12-0 వరకు గిట్టింది. ఈ సంవత్సరం రైతులకు యింకా ఎక్కువ యివ్వడానికి వీలుందని ప్రభుత్వం అంగీకరించింది. అయినా గత సంవత్సరం కంటే ఎక్కువయిచ్చి కొనడానికి బదులు, యీసంవత్సరం వ్యాపారస్తులు బస్తా 1 కి రు. 0-4-0 ల నుండి రు. 0-10-0 ల వరకూ తగ్గించికొంటున్నారు. బస్తా 1 కి రు. 1-0-0 చొప్పున అన్యాయంగా అదనపు లాభం వ్యాపారస్థులు కాజేస్తున్నారు. చెమటోడ్చి పండించే రైతుకు ఘోరమైన అన్యాయం జరుగుతోంది. న్యాయంగా రైతుకు రావలసిన ధరలు రావడంలేదు. ధాన్యాన్ని ఉత్పత్తిచేసే రైతుకు న్యాయమైన ధర రాకపోతే నిరుత్సాహపడడం, అసంతృప్తి జెందడం సంభవిస్తుంది. రైతులు నిరుత్సాహపడితే అధికాహారోత్పత్తి కార్యక్రమం దెబ్బతింటుంది. ధాన్యానికి ధరలు ఖచ్చితంగా నిర్ణయించకపోవుటచేతనూ, ప్రభుత్వమే ధాన్యాన్ని కొనకపోవుటవల్లా, రైతులకు బియ్యము ఇవ్వడానికి మిల్లింగుసౌకర్యములు కల్గించక పోవడంవల్లా, రైతులకు అన్యాయమూ, వ్యాపారస్థులకు అక్రమలాభాలూ ధాన్యం దొంగమార్కెటులోకి పోయేప్రమాదమూ ఏర్పడుతున్నాయి. దీనివల్ల యిటు రైతులేగాక, విశాఖ, రాయలసీమ, పల్నాడులలోనుండే రైతులూ, ప్రజలూకూడా బాధపడతారు. వ్యాపారుల దయాదాక్షిణ్యముమీద అందరూ ఆధారపడవలసివస్తుంది. ప్రభుత్వం వ్యాపారస్థుల చేతులలో కీలుబొమ్మ. ధాన్యం అంతా జారవిడిచినవిమ్మట చేసేదేముంది దొంగవ్యాపారానికి సుళువేర్పడడం తప్ప?

ప్రభుత్వం వెంటనే రాష్ట్రమంతటా ఆహారసమస్యను సమగ్రంగా పరిష్కరించుటకు పూనుకోవాలి. రైతుసంఘాల సలహాలను పాటించాలి. రైతుల న్యాయమైన కోర్కెల పీడేర్చాలి. వెంటనే ధాన్యానికి న్యాయమైన కనీస ధరలను రాష్ట్రమంతటా ఖచ్చితంగా నిర్ణయించాలి. రైతులకు బియ్యంగా యివ్వడానికి అవకాశం కలుగజెయ్యాలి. అవసరమైనచోట్ల మిల్లులను స్వాధీనం చేసుకోవాలి. (ప్రభుత్వమే ⅛ వంతు ధాన్యాన్ని కొని నిల్వచేయాలి.) ప్రజలకు కంట్రోలు రేటుకు బియ్యం సప్లయిచేయాలి. ఇలాచేయడంవల్ల ప్రభుత్వం కంట్రోలురేట్లను అమలు జరుపగలుగుతుంది. రైతులకు సరియైన ధరలను నిర్ణయించిననాడే, రైతులు ఎక్కువధాన్యాన్ని ఉత్పత్తిచేసి, ధాన్యాన్ని ఎవరంతట వారే యివ్వడానికి ముందుకువస్తారు. రాయలసీమలో మెట్టధాన్యాలకు ఒకే న్యాయమైనధర నిర్ణయించాలి. పంపకమూ విడుదలా ఆలస్యములేకుండా జరిగేటట్లు చూడాలి. లేకపోతె ఆహారపదార్థాలు ముక్కిపోయి నాశనమైపోవడం జరుగుతుంది.

చవుకపారు వినాదాలకు రైతులు మోసపోకండి

ఈ పరిస్థితిలో రైతులు, రైతుసంఘాలూ ధాన్యాల కనీసధరలను ఖచ్చితంగా నిర్ణయించాలని తీవ్రాందోళన చేయాలి. లేకపోతే ప్రభుత్వం వప్పుకున్న ధరనైనా ధాన్యానికి యివ్వకుండా వ్యాపారస్తులు బాగా తగ్గించి కొంటున్నారు. ఈ పరిస్థితిలో రంగాగారు ధాన్యంధరలు నిర్ణయం (Fix) చేయాలని ఆందోళన చేయడానికి బదులు, అసాధ్యమైనట్టి, చవుకపారు నినాదం బస్తా 1కి రు. 12 లు కావాలనడం శోచనీయం. రాష్ట్రంలో బస్తా 1కి రు. 10-4-0 లకు, బసంగులు వగయిరా బస్తా 1కి రు. 8-4-0 లకు వ్యాపారస్తులు కాజేస్తున్న యీ సమయంలో! పరిస్థితిని గమనించకుండా బస్తా 1కి రు. 12 లు కావాలంటూ నినాదాలు యివ్వడం రైతులకు న్యాయమైన ధరలు రాబట్టడానికి ఉద్దేశించికాదు. చవుకపారు వినాదాలతో, ఆశలను రేకెత్తించి, రైతుల నాకర్షించి తన వర్గ విద్రోహచర్యలకు అండగా చేర్చుకోడానికి మాత్రమే. లేకపోతే బస్తా 1కి రు. 11 లు రాబట్టడమే అసాధ్యమైపోతున్న యీ సమయంలో, పరిస్థితిని గమనించకుండా, తరుగుప్రాంతాలను దృష్టిలో పెట్టుకోకుండా, బస్తా 1కి రు. 12 లు ధర న్యాయమైనట్టి, ఆచరణ సాధ్యమైనట్టికోరిక అవునా? కాదా? అనే విచక్షణలేకుండా యిష్టంవచ్చినట్లుగా నినాదాలు యివ్వడం దేనికి? రైతాంగం తమ వర్గానికి విద్రోహాన్ని ఒడిగట్టిన విద్రోహులను నమ్మి మోసపోవలదని మనవి. మన వర్గానికి స్వాతంత్ర్యంలేదనీ, మనకుస్వతంత్ర వర్గసంస్థ వుండవవసరంలేదనీ, మనజెండాను తీసివేయాలనీ చెప్పే ద్రోహుల చవుకబారు వినాదాలకు లెక్కచేయ నవసరంలేదు. రైతాంగం తమ స్వతంత్ర ఐక్య రైతుసంఘ నాయకత్వాన, సోదర వ్యవసాయకూలీల, యితర ప్రజానీకంయొక్క సహకారంతో ముందుకు సాగిపోతుంది. ఆ విధంగా మన కోర్కెలను మనం యీడేర్చుకుంటాం. కాబట్టి ధాన్యంధర నిర్ణయించాలనీ, మిల్లింగు సౌకర్యాలు ఎర్పరచాలనీ తీవ్రఆందోళనచేసి, తమ ధాన్యానికి న్యాయమైన ధరరాబట్టుకోడానికై రైతాంగమంతా ముందుకు రావాలని కోరుతున్నాను.

ప్రజాశక్తి చందావివరాలు

సంవత్సరం చందా	5—0—0
అర్ధసంవత్సరం చందా	2—8—0
మూడునెలలచందా	1—4—0

చీమూరు, అస్తి యువకులను ఉరికంబాలనుండి రక్షించాలి

1942 ఆగష్టు ఘటనల సందర్భంలో, మధ్యరాష్ట్రంలోని చీమూరు, అస్తి గ్రామాల్లో కోపోద్రిక్తులైన ప్రజలమధ్య-పోలీసులమధ్య తీవ్రసంఘర్షణ జరిగింది. తత్ఫలితంగా ఇరుపక్షాల్లోను కొందరు చనిపోయారు. ప్రభుత్వం దారుణ నిర్బంధవిధానం అమలుజరిపి, అనేకమందిపైన కేసులు పెట్టడం, యీ సందర్భంలో 15గురు యువకులపై ఉరిశిక్ష ఖాయం కావడం అందరూ యెరిగిందే.

యవ్వనంలో వున్న యీ ముద్దాయిలను ఉరికంబాలనుండి రక్షించడానికై యావద్భారత దేశంలోని వివిధరాజకీయపక్షాలవారు, వ్యక్తులు బహిరంగసభల ద్వారా, మహజర్ల ద్వారా, యితరవిధాల ఆందోళన గావిస్తున్నారు. సోదర దేశభక్తులు ఉరికంబాలవాతబడి అసువులు బాయబోతున్నారంటే పరితపించని భారతీయుడులేడు. ఇతరరాష్ట్రాలతోపాటు ఆంధ్ర దేశంలో గూడా ప్రజాసంఘాలు చీమూరు, అస్తి సోదరులను రక్షించుకోడానికి ఆందోళన సాగిస్తున్నవి.

6-1-45న జరిగిన చింతలపూడి (పశ్చిమ గోదావరిజిల్లా) ఫిర్కా రైతుమహాసభలోను, 9-1-45న తణుకు తాలూకా (ప. గోదావరి) చెరుకువాడ గ్రామంలో కమ్యూనిస్టు కమిటీ ఆధ్వర్యాన జరిగిన బహిరంగసభలోను, 8-1-45న గుంటూరుతాలూకా తాడికొండలో సమావేశమైన బహిరంగసభలోను,చీమూరు, అస్తి యువకులను గూర్చి ఉపన్యాసాలు, తీర్మానాలు గావించబడ్డాయి.

10-1-45 తేదీన శ్రీ దువ్వూరి బలరామ రెడ్డిగారి అధ్యక్షతను జరిగిన నెల్లూరుజిల్లా రైతుసంఘకార్యవర్గ సమావేశంలో చీమూరు, అస్తి నిందితులపై విధించబడ్డ ఉరిశిక్షను రద్దుచేయమని కోరుతూ తీర్మానించబడ్డది.

ఊటుకూరు (నెల్లూరుజిల్లా) గ్రామస్తులు కూడా చీమూరు, అస్తి యువకులను రక్షించుకుందామని నిశ్చయించి, తమ పరితాపాన్ని కార్యదీక్షను బహిరంగసభద్వారా ప్రకటించారు.

నెల్లూరుజిల్లాలోనే, ఆత్మకూరులో శ్రీ తూములూరి రమణయ్యగారి అధ్యక్షతను జరిగినసభలో జి.సి. కొండయ్యగారు ఉపన్యసిస్తూ చీమూరు, అస్తి యువకులను ఉరితీయాలనుకున్న ప్రభుత్వనిర్ణయం బ్రిటన్, భారతదేశాల మధ్య పరశత్రుత్వాన్ని పెంపొందించకపోగా, యిప్పుడేర్పడియున్న అఖాతాన్ని మరింత అధికం చేస్తుందన్నారు. ఈ దుష్ఫలితాల నరికట్టాలంటే ఉరికంబాల నెక్కనున్న యువకులను రక్షించడం తక్షణ కర్తవ్యమని ప్రభుత్వాన్ని కోరారు. ఈసందర్భంలో ఆత్మకూరు తాలూకాలో కమ్యూనిస్టుపార్టీ, రైతుసంఘం మొదలైన ప్రజాసంస్థలన్నీ యేకమై ఐహాకప్రచారం గావిస్తున్నాయని చెప్పారు.

ఈ సందర్భంలోనే 11-1-45న నెల్లూరులో ప్రముఖ న్యాయవాదులైన శ్రీ ముంగమూరు మల్హారావుగారి అధ్యక్షతక్రింద బహిరంగసభ జరిగింది. శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ఉపన్యసిస్తూ, 1942 ఆగష్టు నాటి పరిస్థితులు యీనాడు లేవనీ, బ్రిటన్-భారత దేశాల నడుమ సుహృద్భావం కలగాలంటే చీమూరు, అస్తి యువకులకు ఉరిశిక్ష రద్దు చేయాలనీ అన్నారు. శ్రీ ఓరుగంటి వెంకటసుబ్బయ్య, ముత్తరాజుగోపాలరావు, వెన్నెలకంటి రాఘవయ్య, ఉండవల్లి కృష్ణరావుగార్లు కూడా చీమూరు, అస్తి నిందితులను ఉరికంబాలనుండి విడుదలచేసే ఆవశ్యకతనుగూర్చి వివరించారు. ఉరిశిక్షను రద్దుచేయమంటూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించబడ్డది.

14-1-45 సాయంత్రం బెజవాడ రామమోహన లైబ్రరీలో కాంగ్రెసు వాదులైన శ్రీ కుందేరు సత్యనారాయణ బి. ఏ., బి. ఎల్. గారి అధ్యక్షతను జరిగిన బహిరంగసభలో డాక్టర్ టి. వి. యస్. చలపతిరావుగారు, ముక్కామల నాగభూషణం, మాదల వెంకటేశ్వరరావు, మధుసూదనరావు, తమ్మెన పోతరాజుగారలు చీమూరు, అస్తి ముద్దాయిలను విడుదల చేయాలసిన అవసరాన్నిగూర్చి విపులంగా ముచ్చటించారు. ఉపన్యాసాలైన పిదప నిందితులకు విధించిన ఉరిశిక్షను రద్దు చేయమని ప్రభుత్వాన్ని కోరుతూ యేకగ్రీవంగా తీర్మానింపబడింది. మధ్యరాష్ట్ర గవర్నరుకు టెలిగ్రాంద్వారా తీర్మానం పంపబడ్డది.

ఇవిగాక బందరు, బెజవాడ, గుంటూరు విద్యార్థిసంఘసభల్లో, చీమూరు, అస్తి యువకులను ఉరికంబాలనుండికాపాడమని ప్రభుత్వాన్నికోరుతూ తీర్మానాలుగావించి పంపించారు.

★

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘాధ్యక్షులు కడియాల గోపాలరావుగారు చీమూరు, అస్తి కేసులలో ఉరిశిక్ష విధించబడిన 15 గురికి శిక్ష రద్దుచేయాలనీ, బ్రిటన్ - భారతదేశాల మధ్యగల అగాధాన్ని యీ రక్తపాతంద్వారా ఎక్కువ చేయవద్దనీ కోరుతూ ఒక ప్రకటన గావిస్తున్నారు.

రాజమండ్రి రైల్వే కార్మికుల ఆదర్శకృషి

యుద్ధం శీఘ్రకాలంలో అంతంకావాలన్నా, మన ప్రజలకు ఆహారపదార్థాలు, యితర అవసరాలు సకాలంలో అందాలన్నా, రైళ్ళు త్వరితగమనంతో యెట్టి అడ్డంకులు లేకుండా సాగాలి.

సరియైన యింజన్లు దీని కత్యవసరం. ఇంజను యేభాగంలోగాని, యేమాత్రం తుప్పుపట్టినా, రాకపోకలూ చురుకుగా సాగవు; బొగ్గుగూడా వృథాగా కాలిపోతుంది.

రాజమండ్రిలో లోకోషెడ్డులో యింజన్లను శుభ్రపరచుటకు 60 మంది క్లీనర్లు పనిచేస్తూ ఉంటారు. కాని వీరిలో 40 మందివరకు యింజన్లను నడిపే పనిలో నిమగ్నులై ఉంటారు. మిలిగిన 20 మంది యింజన్లన్నిటిని శుభ్రపరపడం కష్టంగా ఉంటూ వచ్చింది. ఇంజన్లలో చేరుకునే మకిలిమూలంగా యింజను నడవజాలదు. దీనివల్ల అనేక నష్టాలు సంభవించడం గ్రహించుకొని బ్రాంచి యూనియన్ సలహాతో, అకొద్దిమంది క్లీనర్లు రెండుమూడు యింజన్లమీదనే తమ శక్తిని కేంద్రీకరించి శుభ్రపరచడం మొదలెట్టారు. కార్మికుల కార్యదీక్షను ప్రశంసించి, లోకోఫోర్మన్ యూనియన్ కార్యదర్శితో జరగాలసిన కర్తవ్యాన్నిగూర్చి చర్చించారు. క్లీనర్లసంఖ్యను అధికంచేయాలసిన అవసరాన్ని ప్రతినిధులు సూచించారు. దీని ననుసరించి ఫోర్మన్ 40 మందిని అదనంగా నియమించారు. చెడిపోయిన ఇంజన్లనుబాగుపరచడాని కవసరమయ్యే సామాన్లు, పెరంబూరు వర్కుషాపునుండి లోకోషెడ్లకు 10 రోజులకొక పర్యాయం రైలులో వస్తూ ఉండేవి. ఈ కారణంగా మరమ్మతులు ఆలస్యమవుతుండేవి. ఇప్పుడా పద్ధతిమార్చి ప్రతిరోజు సామానుబండ్లు వచ్చేలా చేశారు. ఈనూతన పద్ధతి మూలంగా, అదనంగా కొందరు కార్మికులు, గుమాస్తాలు నియమించబడ్డారు. లోకోషెడ్లలో మరమ్మతుపని యెగుడుదిగుడు లేకుండా యధావిధిగా సాగిపోతున్నది.

★

పాకాల రైల్వేడిపోలో ఆహారపదార్థాలన్నీ లేవు

రైల్వే అధికార్లు పాకాల రైల్వే చౌకడిపోద్వారా గత 1½ సంగనుంచి ఆహారపదార్థాలు సప్లయి చేస్తున్నారన్న పేరేగాని, వస్తుమని వదిపదార్థాలు అమ్మిన పాపానపోలేదు. ఐదారుమాసాలనుంచి కట్టెలు, పప్పుదినుసులు, బియ్యం, నూనె, గోధుమలు, గుడ్డలు వగైరా సప్లయికాక నానా యిక్కట్లు పాలవుతున్నారు కార్మికులు. పండుగకు, పబ్బానికి కూడా నూనెబొట్టు దొరక్కపోవడం చూస్తే, యీ చౌకడిపోలు కార్మికుల కండ్లనీళ్ళు తుడవడానికా అన్నట్టున్నది. కరువుభత్యం యెక్కువ చేయమని అధికార్లను కోరితే, "చౌకధరలకు సామాను అందజేస్తున్నాముగా! కరువుభత్యంలో తరుగు దీనిద్వారా పూడ్చుకోవచ్చులే" అని తియ్యటి కబుర్లతో తృప్తిపరచ ప్రయత్నిస్తారు. ఎన్నాళ్ళని ఈ బాధ అనుభవించడం! నానాటికి మరీ దుస్సహమవుతోంది.

ఇలాఉండగా 12-1-45 తేదీన ఫుడ్ కంట్రోలర్ మద్రాసునుండి వచ్చినప్పుడు పాకాల రైల్వేకార్మికులంతా కలిసి తమ యిబ్బందులను చెప్పుకోడానికి ఆయనవద్దకు వెళ్లారు. "చౌకడిపో సలహాకమిటీకి చెప్పుకోండి" అని ఒక్కమాటలో సమాధానమిచ్చాడు అధికారి. సలహాసంఘం సక్రమంగా పనిచేయడంలేదనీ, అందువల్ల తామే శ్రద్ధవహించి కార్మికుల కవసరమైన పదార్థాలన్నిటినీ సప్లయి ఆయేటట్లు చూడాలనీ కార్మికులు అధికారిని కోరగా, సవ్యమైన సమాధాన మివ్వకుండానే దాటిపట్టాడు ఫుడ్ కంట్రోలర్.

జపాను రాకాసి మూకలను నిర్మూలం చేయాలన్నా, కరువుకాటకాలనుంచి ప్రజానీకాన్ని రక్షించాలన్నా, రైల్వేకార్మికు లాచరించాలసిన కర్తవ్యం అతి భారమైనది; త్యాగంతో కూడుకున్నది. కార్మికులకు తృప్తిగా ఆహారపదార్థాలు సప్లయి అయి, వారి ఆరోగ్యం సంరక్షించుకుంటేనేతప్ప, ఒడిదుడుకులు లేకుండా తమ విద్యుక్తధర్మాన్ని నెరవేర్చనూలేరు; సోదర దేశప్రజలను శత్రువులనుంచి, కరువు కాటకాలనుంచి కాపాడనూలేరు. కాబట్టి ప్రజలుగూడా తమ బాధ్యతను గుర్తెరిగి, అధికారులు రైల్వే కార్మికుల యిబ్బందులు తీర్చేట్టుగా విరంతరాందోళన చేయాలసిఉంది.

సోంపేట తాలూకాలో కరువు పరిస్థితి

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం తరపున విశాఖపట్నం జిల్లా, సోంపేట తాలూకాలో కరువునివారణకై పనిచేస్తున్న వాలంటీర్లు మార్పు పద్మనాభంగారు, గానుగుల తరణి ఆదారిగారు, యీక్రింది ప్రకటన గావిస్తున్నారు:

ఇచ్చట ఉచిత భోజనశాలలలో భోజనం చేయు అనాధులకు తిండి చాలుటలేదు. బట్టలు అసలేలేవు. రాత్రి పడుకోవడానికి స్థలంలేదు. అందువల్ల మంచులోపడుకోవలసి వస్తోంది. ఈవిధంగా వారు అనేక యిబ్బందులుపడుతున్నారు. వైద్యసౌకర్యం లేనేలేదు. ప్రభుత్వంవెంటనే వీటినితొలగించి, సహాయపడాలి. అలాచేస్తే, వీరు త్వరలో తమ తమ పనులు చేసుకోడానికి సిద్ధంకాగలరు.

ఇచ్చటి బర్మా కాందిశీకులకు ప్రభుత్వం ప్రతినెల పేమెంట్లు యిచ్చేపద్ధతిని ఆపుచేసి, హరిపురంలో ఉచిత భోజనశాలలను పెట్టి పనులు చేయించుచున్నారు. కొన్నిగ్రామాలవారికి మాత్రం బట్టలు, డబ్బు యిచ్చారు. కాని, మిగిలిన గ్రామాలవారికి యివ్వడంలేదు. అందరికీ పేమెంట్లు యిచ్చే పద్ధతిని తిరిగి ప్రవేశపెట్టి, వారివారి గ్రామాలలోనే గ్రామపునర్నిర్మాణ కార్యక్రమంలో పెట్టవలెనని ప్రభుత్వాన్ని కోరుచున్నాము.

రైతులకు మందసా జమీందార్లు చేయుచున్న జప్తు యిబ్బందులను వెంటనే తొలగించవలసియుంది. ప్రభుత్వ స్కీము ప్రకారం, రైతులు మదింపుకు, తిండికి, వ్యవసాయపశువులకు కొంత మిగుల్చుకొని మిగతా ధాన్యాన్ని ప్రభుత్వానికమ్ముటకు సంసిద్ధులై వున్నారు. కాని, జమీందార్లు రైతులపై జులుం ప్రయోగిస్తున్నారు. ఈ మధ్య మందసా సింగుపురంలో ఒకరైతు యింట్లో ఎస్టేటువారు జొరబడి, బండ్లు తెప్పించి, ఉన్నధాన్యంలో రైతు అవసరాలకు మిగిల్చకుండా, తీసుకుపోయారు. ప్రభుత్వం వెంటనే యిట్టి అక్రమాలను అరికట్టవలసియుంది. జమీందారు పాతబకాయిలను రద్దుచేసేటట్లు చూడాలి. వడ్డీలేకుండా అప్పులిచ్చి, ప్రభుత్వం పేదరైతాంగాన్ని కాపాడాలి. జలాధార వసతులను కల్పించాలి. వాటికి బర్మా కాందిశీకులను వినియోగించాలి.

సముద్రప్రాంతంలో చేపలుపట్టి జీవించే వారిమీద జమీందారీ శిస్తు సం 1కి రు. 10 చొప్పున తీసుకొంటున్నారు. సముద్ర పోటుపాటులపై ఆధారపడుతూ, బహు కొద్ది ఆదాయంమాత్రమే వచ్చే యీ బీద ప్రజలకు పన్నులేకుండా చేయాలి.

ఈతాలూకాలో పారంగపురం, పాలవలస, బారువ, సోంపేట, మందసా మొదలయిన గ్రామాల్లో దేవాంగులకు నూలు సప్లయి లేదు. వారు మరొకవృత్తిచేసుకోలేరు కాబట్టి, వెంటనే ప్రభుత్వం నూలు సప్లయికి, గంజి నిమిత్తం బియ్యం రేషనింగుకు తగుఏర్పాట్లు చేయవలెనని యిన్నది.

కాంగ్రెసు ఎన్నడూ పోటీ సంఘాలను ప్రోత్సహించలేదు

— శ్రీమతి సరోజినీ

శ్రీమతి సరోజినీనాయుడు కలకత్తా నుండి మద్రాసు వెళ్లుతున్న సందర్భంలో యీనెల 16 వ తేదీ రాత్రి బెజవాడ స్టేషనులో రైతుసంఘం, మహిళాసంఘం, కమ్యూనిస్టు పార్టీల తరపున ఘనమైన స్వాగత మీయబడింది. స్త్రీలూ, పురుషులూ ప్లాటుఫారమంతా క్రిక్కిరిసిపోయారు.

మహిళాసంఘం తరపున సిటీ మహిళా సంఘాధ్యక్షురాలు డా॥ అచ్చమాంబగారు, కృష్ణాజిల్లా మహిళాసంఘాధ్యక్షురాలు శ్రీ కాట్రగడ్డ హనుమాయమ్మగారు, కార్యదర్శిని శ్రీ వెల్లంకి అన్నపూర్ణమ్మగారు, శ్రీ మానికొండ సూర్యావతిగారూ సరోజినీనాయుడుకు పూలమాలలువేసి, పండ్లు-ఫలాలు సమర్పించారు. రైతుసంఘం తరపున శ్రీ కడియాల గోపాలరావుగారు, కాట్రగడ్డ రాజగోపాలరావుగారు, వండూరి ప్రసాదరావుగారు స్వాగతమిచ్చారు.

కాంగ్రెసు పోటీసంఘాలను ప్రోత్సహించదు

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారు స్వాగతమిస్తూ ఆంధ్రదేశంలో రైతుసంఘాలయెడ కొంతమంది కాంగ్రెసువాదు లవలంబిస్తున్న దృక్పథాన్ని విశదీకరించారు. రైతుసంఘాల విషయంలో శ్రీమతి సరోజినీనాయుడు ఇలా చెప్పింది.

"మీరు బాగా పనిచేయండి. రైతుల కష్టాల నీడేర్చటం మీ ప్రధానాశయంగా పెట్టుకోండి. మా అబ్బాయి బెజవాడలో జరిగిన అఖిలభారత కిసాన్ మహాసభకు వచ్చాడు. మీరు చేస్తున్నపని విని చాల సంతోషించాడు. మీ సంఘాన్ని మాత్రం షాహుకార్ల చేతుల్లోకి పోనీయకండి" అంటూ, ప్రస్తుతం పని చేస్తున్న రైతుసంఘాలకు పోటీగా కాంగ్రెసు పేరుతో కొత్తసంఘాలు స్థాపించబడుతున్న సంగతి తెలియపర్చగా ఆమె ఇలా అంది. "కాంగ్రెసు ఎన్నడూ పోటీసంఘాలను ప్రోత్సహించదు. నాకు తెలిసినంతవరకూ కాంగ్రెసు ఎవ్వరినీ పోటీసంఘాలు పెట్టవలసిందిగా ఆదేశించలేదు. మీరు రైతుల శ్రేయస్సుకోసం బాగా కృషిచేయండి. కాంగ్రెసు ఆదేశాలను శిరసావహించండి. మీ సంఘాలను బలపర్చుకోండి. మిమ్మల్నెవ్వరూ ఏమీ చేయలేరు."

గాంధీగారి ఆశీర్వాదాలున్నాయంటూ రంగాగారు రైతుసంఘానికి పోటీగా కిసాన్ కాంగ్రెసును స్థాపిస్తున్న సంగతి సరోజినీ నాయుడుగారి దృష్టికితేగా "మీరీ విషయం గాంధీగారికి తెలియపర్చండి. వివరాలన్నీ విశదీకరిస్తా"రన్నారు.

స్వాతంత్ర్యంకోరే ప్రతివారికి కాంగ్రెసులో స్థానముండాలి

విశాఖజిల్లా కాంగ్రెసు ప్రముఖుల ప్రకటన

శ్రీ పి. వీరభద్రస్వామిగారు నూతనంగా ఏర్పడిన విశాఖజిల్లా కాంగ్రెసు అసెంబ్లీ కార్యదర్శి. వారిని మా విలేఖరి కాంగ్రెసు-కమ్యూనిస్టుల సంబంధాలను గురించి ప్రశ్నించినపుడు చెప్పిన సమాధానాలు క్రింద ప్రకటించుచున్నాం.

ప్రశ్న: విశాఖజిల్లా కరువుబాధితులకు సాయంచేయడానికి అన్నిపార్టీలతోగూడిన కరువునివారణ కమిటీ ఏర్పడింది. దీనికి కె. యస్. గుప్తగారు అధ్యక్షులు. ఈ విషయంలో మీ వుద్దేశ్యమేమిటి?

సమాధానం: ఇటువంటి కమిటీ ఏర్పడ్డం నేను పూర్తిగా బలపరుస్తాను. ఇటువంటి కమిటీలలో మనమంతా వుండాలి. కలసి పని చేయాలి. ప్రజలకు సేవచేయాలి.

ప్రశ్న: కలకత్తాలో శ్రీమతి సరోజినీ నాయుడు కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమం సాగించేవారి సమావేశంలో ఇచ్చిన ఉపన్యాసాన్ని చూశారా? కాంగ్రెసు ఒక ప్రజాస్వామికసంస్థ. స్వాతంత్ర్యంకోరే ప్రతివానికి ఆ సంస్థలో స్థానం ఉందని ఆమె చెప్పింది. ఈ విషయంలో మీ అభిప్రాయమేమిటి?

సమాధానం: కాంగ్రెసులోనుంచి కమ్యూనిస్టులను బహిష్కరించాలనే దృక్పథంతో నే నేకీభవించను. భారతదేశానికి పూర్తి స్వాతంత్ర్యంకోరే ప్రతివానికి కాంగ్రెసులో స్థానం వుండాలి. నేను కమ్యూనిస్టుల ప్రజాయుద్ధ వినాదాన్ని అంగీకరించను. కాని, శ్రీమతి సరోజినీనాయుడు కాంగ్రెసు ప్రజాస్వామిక సంస్థ అని చెప్పింది. ఈ విషయంలో ఆమెతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. శ్రీమతి సరోజినీనాయుడు చెప్పినదానిని కాంగ్రెసులోనున్న కమ్యూనిస్టు స్నేహితులు అంగీకరించమని వారిని కోరుతున్నాను.

శ్రీ కె. యస్. గుప్త

యం. యల్. ఏ. (సెంట్రల్)

నేను ఎంతో జాగ్రత్తగాను, శ్రద్ధతోను, 1943 సంవత్సరంనుంచి కమ్యూనిస్టులు చేసే పనిని పరీక్షించుచున్నాను. వారి ప్రజాయుద్ధ నినాదంతో నేనంగీకరించను. స్వాతంత్ర్యమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ప్రజల కష్టాలను నివారింపడానికి కమ్యూనిస్టులుచేసే నిరంతర కృషిని చూచి నేను చాలా సంతోషించాను.

1943 వ సంవత్సరం అక్టోబరు 31 వ తారీఖున విశాఖజిల్లాలో పెద్దతుపానువచ్చింది. దానివల్ల విపరీత కరువుపరిస్థితులు ఏర్పడినాయి. ఈ కరువు నివారణకు కృషిచేయడానికి మొదటినుంచి నేను వారితో సంబంధం పెట్టుకున్నాను. మేము కలసిమెలసి స్నేహితులలాగా పనిచేశాము. కాంగ్రెసు ఆశయాలను అంగీకరించిన కమ్యూనిస్టులను కాంగ్రెసులో చేర్చుకోవడంద్వారా, కాంగ్రెసు ఎప్పటిలాగానే బలవత్తరంగా వుంటుందని నేను నమ్ముతున్నాను.

జిల్లా మహాసభలు

జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో యీ క్రిందికార్యక్రమం ప్రకారం జిల్లాల మహాసభలు జరుగుతాయి:

గుంటూరుజిల్లా విద్యార్థి మహాసభ

నందిపాడులో: జనవరి 27, 28 తేదీలలో

4వ ప. గోదావరిజిల్లా విద్యార్థివైజ్ఞానిక మహాసభ

తణుకులో: ఫిబ్రవరి 3, 4 తేదీలలో

నెల్లూరుజిల్లా రైతుమహాసభ

ఆత్మకూరులో: ఫిబ్రవరి 20

(ఆహ్వానసంఘాధ్యక్షులు: పండూరి సుబ్బారెడ్డి, కార్యదర్శి: బి. సి. కొండయ్య)

కర్నూలుజిల్లా రైతుమహాసభ

వెలుగోడులో: మార్చి 4

అధ్యక్షులు: పుచ్చలపల్లి సుందరయ్యగారు

(ఆహ్వానసంఘాధ్యక్షులు: వై. స్వామిరెడ్డి; కార్యదర్శి: ఎం. సుబ్బారెడ్డి)

ప. గోదావరిజిల్లా రైతుమహాసభ

జిన్నూరులో: మార్చి ఆఖరువారంలో

కృష్ణాజిల్లా మహిళామహాసభ

కాటూరులో: మార్చి 3, 4 తేదీలలో

ఆయా జిల్లాల ప్రజలు పై మహాసభలను జయప్రదమొనర్చుటకు విరివిగా ధన, వస్తు సహాయం చేయవలసిందని ఆహ్వానసంఘ కార్యకర్తలు కోరుతున్నారు.

అటవీ పంచాయితీలను రద్దుచేయకూడదు

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘాధ్యక్షులు శ్రీ కడియాల గోపాలరావుగారీ దిగువప్రకటన చేయుచున్నారు:

ప్రభుత్వం అటవీ పంచాయితీలను రద్దుచేసి అపనిని ఫారెస్టు డిపార్టుమెంటుకు అప్పగించాలని ఆలోచించుచున్నట్లుగా తెలియుచున్నది. ఈ ప్రభుత్వ నిర్ణయం రైతాంగమునకు నష్టదాయకము.

1912 లో ఫారెస్టు కమిటీ, రిజర్వు ఫారెస్టులలో సి. డి. తరగతులను పశుగ్రాసము, వ్యవసాయ పనిముట్లు, వంటచెఱకు, పచ్చి ఎరువులు- వీటిని రైతులు తెచ్చుకోడానికి అజమాయిషీ పంచాయితీలకు యివ్వాలన్నారు. 1914లో కొన్నిఅడవులను పంచాయితీలపరం చేశారు. 1923 లో రిట్రెంచి కమిటీ సిఫారసుల ఫలితంగా పశుగ్రాసం, వంటచెఱకు యిచ్చే అడవులను "రైతు అడవు" లని పేరుపెట్టి, అట్టి అడవులను ఫారెస్టు డిపార్టుమెంటునుండి అటవీ పంచాయితీలకు యిచ్చారు. తదాది ప్రజలచే ఎన్నుకొనబడిన పంచాయితీలు ఈ అడవులపై పెత్తనాన్ని నిర్వహించుచున్నాయి. కాని కొన్ని పంచాయితీలు పార్టీ కక్షలవల్ల, స్వార్థపరులగు పెత్తందారులవల్ల తమ బాధ్యతలను నెరవేర్చలేక పోతున్నాయి. ప్రత్యేకంగా ఆ పంచాయితీలను సరియైన పద్ధతులలో నడిచేటట్లు చూడాలిగాని, అసలు పంచాయితీలనే రద్దుచేసి, తిరిగి అటవీపరిపాలన సంతనూ నిరంకుశాధికారుల చేతులలో పెట్టటం ప్రజాస్వామిక సూత్రాలకే విరుద్ధం. కాబట్టి ప్రభుత్వం అటవీ పంచాయితీలను రద్దుచేయాలను తలంపును మానవలసినదిగా కోరుచున్నాను.

స్వాతంత్ర్య దినోత్సవం జరపండి!

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధానకార్యదర్శి వండూరి ప్రసాదరావుగారు ఈ క్రింది విజ్ఞప్తి గావిస్తున్నారు:

"స్వాతంత్ర్యదినోత్సవంసమీపిస్తోంది. భారతదేశ స్వాతంత్ర్యసంపాదనకై ప్రతిజ్ఞను తీసుకొనే పవిత్రదినం అది. ఈఏడాది మనం దీనినెట్లా జరపాలి?

"ప్రపంచచరిత్రలో ఈనాడు మహత్తరమగు సంఘటనలు జరుగుతున్నాయి. కాని మనదేశంలో పరిస్థితులు అతి ప్రమాదకరంగా ఏర్పడివున్నాయి. కరువుకాటకాలు దేశాన్ని పీల్చి పిప్పిజేస్తున్నాయి. దేశాన్ని రక్షించగల, ముందుకు తీసుకుపోగల, ప్రధాన రాజకీయసంస్థలు ఐక్యతతో నడుచుటకు మారుగా ఒకదానినుండి మరొకటి మరింత దూరంగా పోతున్నాయి. అమెరీ, వేవెలు ప్రభువుల ఆటలు యదేచ్ఛగా సాగిపోతున్నాయి.

"ఇటువంటి సమయంలో మన కాంగ్రెసు నాయకుల విడుదల అత్యంతావశ్యకమై యున్నది. ఈసంక్షోభిత దినాలలో వీరే దేశభక్తులకు సరియగుమార్గాన్ని చూపగలరు. వీరే కాంగ్రెసులోని ఐక్యతను కాపాడి ముందుకు తీసుకుపోగలరు. వీరే దేశభక్తులమధ్య ఉన్న అంతర్యుద్ధాన్ని మాన్పి జాతీయైక్యతకు మార్గాన్ని సుగమం చేయగలరు. కాబట్టి వారి విడుదలకై మనమానాడుతీవ్రాందోళనచేయాలి.

"ఆంధ్రదేశంలోని రైతు సంఘాలన్నీ సోదరదేశభక్తులతోనూ, ప్రజాసంస్థలతోనూ కలిసి ఈస్వాతంత్ర్య దినోత్సవమును జయప్రదం గావించగోరుచున్నాను."

విద్యార్థులందరికీ ఒకేసంఘం వుండాలి!

విశాఖజిల్లా కాంగ్రెసునాయకుల ప్రకటన

కలకత్తాలో డిసెంబరు 28 నుంచి 31 వరకు జరిగిన అఖిలభారత విద్యార్థిఫెడరేషన్ మహాసభలో విద్యార్థులు తీసుకున్న నిర్ణయాలు చాలాబాగావున్నాయి. శ్రీమతి సరోజినీనాయుడు వుపన్యాసం విన్నతర్వాత వారంగీకరించిన తీర్మానాలు దేశంలో నేడున్న వివిధవిద్యార్థిసంఘాలమధ్య ఐక్యత తీసుకువడానికి ఎంతో తోడ్పడతాయి. ఇప్పుడు అన్ని విద్యార్థిసంఘాలు, దాదాపు ఒకే కార్యక్రమాన్ని అవలంబించుతున్నాయి. కాబట్టి అందరూ కొద్దిరోజులలో ఐక్యమవుతారని భావించుచున్నాము. గాంధీజీచే తయారుచేయబడిన నిర్మాణకార్యక్రమం విద్యార్థులు గ్రామాలలో పని చేయడానికి ఎంతో తోడ్పడుతుంది. వివిధసంఘాలకు సంబంధించిన విద్యార్థులు ఈనాడు నిర్మాణకార్యక్రమంమీదనే కేంద్రీకరించాలి.

పి. వీరభద్రస్వామి, యం. యల్. సి., (సెంట్రల్)

విశాఖజిల్లా కాంగ్రెసు అసెంబ్లీ కార్యదర్శి.

★

ప్రముఖవిద్యావేత్తయైన ప్రొఫెసర్. డి.పి. ముఖర్జీని అధ్యక్షునిగాను, శ్రీమతి సరోజినీదేవిని ఉపన్యాసకురాలుగాను, కలకత్తాలో జరిగిన 8 వ అఖిలభారత విద్యార్థిమహాసభకు తీసుకునిరావడంలో విద్యార్థులు చాలమంచి పనిచేశారు. విద్యార్థులలోను, ముఖ్యంగా దేశభక్తులలోను ఐక్యత తీసుకుని రావడానికి సరోజినీదేవి వుపన్యాసం ఎంతైనా తోడ్పడుతుంది. ఈరోజున ఏవ్యక్తియైనాగాని, అతనిలో భారతరక్తంప్రవహించుతుంటే, దేశంలో కరువుకాటకాలకు గురియవుతున్న ప్రజలకోసం పాటుపడాలి. దేశంలో ఆహారం లేకగాని, మందులు లేకగాని ఒక్కవ్యక్తియైనా మరణించకుండా చూడడమే విద్యార్థుల యొక్క మహత్తరకర్తవ్యం. ఒకే విద్యార్థి సంఘనాయకత్వంక్రింద ఐక్యమై విద్యార్థిసోదరులంతా కరువుకాటకాలకు గురియగుచున్న భరతమాతను కాపాడాలి.

ఈ సందర్భంలో మరొకవిషయాన్ని స్పష్టపర్చాలి. వివిధపేర్లతో వివిధవిద్యార్థుల సంస్థలు అనవసరం. మీలోనున్న భేదాభిప్రాయాలను పోగొట్టుకొని దేశానికి సేవచేయడానికి మీరంతా ఒకే దృక్పథంతో ముందుకు సాగిపొమ్మని విజ్ఞప్తి చేస్తున్నాను.

కె. యస్. గుప్త, ఎం. ఎల్. ఎ. (కాంగ్రెసు)

విశాఖజిల్లా కరువునివారణకమిటీ అధ్యక్షులు.



అఖిలభారత విద్యార్థిమహాసభ: బహిరంగసభలో ఒకభాగం

4వ విశాఖజిల్లా విద్యార్థిమహాసభ; అనకాపల్లిలో

నాల్గవ విశాఖజిల్లా విద్యార్థిమహాసభ యీనెల 27, 28 తేదీలలో శ్రీ దేవులపల్లి గణపతి, బి. ఏ. బి. యల్. గారి అధ్యక్షత క్రింద అనకాపల్లిలోజరుగును. శ్రీ కె.యస్. గుప్త, యం.యల్.ఎ. (సెంట్రల్) శ్రీ పసుమర్తి వీరభద్రస్వామి, యం. యల్. సి. గార్లు సభలో ఉపన్యసించ నంగీకరించిరి. సభా సందర్భంలో చిత్రకళాప్రదర్శనం, వైజ్ఞానిక ప్రదర్శనాలుండును.

జిన్నాగారిపట్ల ఆంధ్ర ముస్లింల భక్తివిశ్వాసాలు

అది జనవరి 4 వ తేదీ ఉదయం. బెజవాడ పట్టణంలో ఎక్కడచూచినా ముస్లిం ప్రజల కోలాహలమే. ముస్లిం దుకాణములన్నీ మూసివేయబడిఉన్నాయి. అఖిలభారత ముస్లిం ప్రజానాయకుడైన జనాబ్ మహమ్మదాలీజిన్నాగారి 69వజన్మదినోత్సవం ఆనాడు. బెజవాడ ముస్లింలు వేడుకగా ఆరోజు ఊరేగింపులోను, సభలలోను, పాల్గొనేటందుకు ఉత్సాహపడుతున్నారు.

ఇస్లాంపేటలో కొత్తగా స్థాపింపబడిన "జిన్నా లైబ్రరీ"కి జనాబ్ సయ్యద్ సలాఉద్దీన్, జనాబ్ అజీమ్‌సాహెబ్, జనాబ్ అహమదుల్లా హుసేన్ సాహెబ్‌గారలు ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో వారు పట్టణ ప్రముఖులకు యిచ్చిన అల్పాహారవిందులో స్థానిక కాంగ్రెసునాయకులైన డాక్టరు ఘంటసాల శీతారామశర్మగారు పాల్గొన్నారు. మ్యునిసిపల్ చైర్‌మన్ డాక్టరు గోవిందరాజులు నాయుడుగారు లైబ్రరీకి ప్రారంభోపన్యాసం యిచ్చారు. జనాబ్ మహబూబ్ అలీబేగ్‌గారు లీగ్ పతాకోత్సవం జరుపుతూ, "మనం అంతా సోదరులం. అందరం కలిసి, శాంతిసౌఖ్యాలతో వర్ధిల్లవలసినవారం." అని చెప్పారు.

ఊరేగింపు ఇస్లాంపేటనుంచి సుమారు 2 వేలమంది ముస్లిం జనసమూహంతో, బ్యాండు వాయిద్యంతో, సాగిపోయింది. ఊరేగింపుకు ముందు ఎత్తుగా ఆకుపచ్చని జండామీద బాలచంద్రుడు - నక్షత్రం గుర్తులు మెరుస్తున్నాయి. ప్రజలు "మహమ్మదాలీ జిన్నా జిందాబాద్!" "ముస్లింలీగ్ జిందాబాద్!" "పాకిస్తాన్ లేంగే!" మొదలైన నినాదాలు చేస్తూ నడిచారు. ఊరేగింపు షరాబు బజారు చేరింది. రెండువైపులా మేడలపై మంది తట్టలతో పూలవర్షం కురిసింది.

సాయంత్రం 7 గంటలకు ఊరేగింపు మ్యునిసిపల్ ఆవరణచేరుకుంది. అక్కడ జనాబ్ మహబూబ్ అలీబేగ్ సాహెబుగారి అధ్యక్షతకింద జరిగిన బహిరంగసభలో ఖాసిం ఆలీషా అనే ముస్లింకవి తెలుగులో

ఇక గాంధి జిన్నా భిన్నతత్వమేకమవ్వాలీ
భగవాన్ ఖురాన్‌మహిమ బయలుపర్చయ్య

అంటూ చక్కని గీతంపాడి, హిందూ-ముస్లింప్రజల్ని ఉత్సాహితులాగించాడు. మద్రాసు ముస్లింలీగ్ నాయకులలో ఒకరైన బహమనీ సాహెబుగారుసభలో ఉపన్యసిస్తూ, కాంగ్రెసు, లీగ్ వివాదములు అన్నదమ్ముల వివాదములనీ, పాకిస్తాన్‌వల్ల హిందూ-ముస్లింప్రజలు మరింత దగ్గరకు వచ్చుట కవకాశం ఏర్పడుతుందనీ, చెప్పారు. అలీబేగ్ సాహెబ్‌గారు సభను ముగిస్తూ, యీసందర్భంలో అన్నివిధముల తోడ్పడిన స్థానికముస్లింసంస్థలను అభినందించారు. ముస్లింప్రజలు నివసించే ప్రతి తెలుగు పట్టణంలోను, ప్రతి పల్లెటూరులోను లీగ్ సంస్థను స్థాపించి పనిచేయవలసిందని ఉద్బోధించారు.

నెల్లూరు, బెజవాడ పట్టణాలలో లీగు నాయకుల కార్యక్రమం

అఖిలభారతముస్లింలీగ్ నాయకులు నవాబ్ జావాలియాఖత్ అలీఖాన్‌సాహెబ్, నవాబ్ సిద్దిక్ అలీఖాన్‌సాహెబ్, హాజీసత్తార్ సేట్ సాహెబ్‌గార్లు 29-1-45 న నెల్లూరులోను, 30-1-45 న బెజవాడలోను బహిరంగసభలలో ఉపన్యసించెదరు. వారికి ఘనమయిన స్వాగతములిచ్చుటకు నెల్లూరు, బెజవాడ పట్టణములలో ఏర్పాట్లుజరుగుచున్నవి. ఆంధ్రజిల్లాలలోని మహమ్మదీయ సోదరులందరు ఈ సభలకు హాజరయి వారిచ్చు సందేశమును విని, ముస్లింలీగ్‌యందు తమ కున్న విశ్వాసమును ప్రకటించవలెనని కోరుచున్నాను.

ఎం. ఎ. ఖాన్,

సహాయకార్యదర్శి, కృష్ణా ముస్లింలీగ్.

పార్టీఫండుపై వ్యతిరేకుల తప్పుడు ప్రచారం

21వ తేది 'ఆంధ్రపత్రిక'లో రైతుసంఘాల పేరుతో కమ్యూనిస్టుపార్టీకి డబ్బు వసూలు చేయవలసినదని పార్టీసభ్యులకు సర్క్యులరు పంపినట్లు, సర్క్యులరులోని కొన్ని వాక్యాలను ఉదహరిస్తూ ఏలూరువిలేఖరి వ్రాశారు. కమ్యూనిస్టు సర్క్యులరకు పెడర్థాలుతీసి, కమ్యూనిస్టు వ్యతిరేకప్రచారం చేయడంలో యిది మరొక ఉదాహరణ. రైతుసంఘాలలోను, ఇతర ప్రజాసంఘాలలోను పనిచేసే పార్టీసభ్యులు, పార్టీకోసం డబ్బు వసూలు చేస్తే, ప్రజాసంఘాల విషయమేమిటని అడిగారు. ఒకే వ్యక్తినుండి పార్టీకి, ప్రజాసంఘాలకు డబ్బు వెంట వెంటనే వసూలుచేయడం కష్టమని చెప్పారు. వారిప్రశ్నలకు, సందేహాలకు జవాబు చెప్తుతూ పార్టీ బలంగా ఉన్న గ్రామాలలో పార్టీకి ప్రధానంగా వసూలుచేయమని, ఇతర గ్రామాలలో రైతుసంఘాలకు వసూలుచేయమని పార్టీసర్క్యులరులో వివరించబడింది. సర్క్యులరు ఉద్దేశం ఇదేనని చెప్పడానికి, పార్టీకి ఇచ్చే గట్టి సానుభూతిపరులనుండికూడ కొంత రైతుసంఘానికి ఇప్పించాలనడమే తార్కాణం. పార్టీకి వసూలు చేసేడబ్బంతా, ఏగ్రామంలో వసూలుచేసినా, కమ్యూనిస్టు పార్టీకని స్పష్టంగా ప్రజలకు చెప్పే వసూలుచేస్తాంగాని మరొక సంఘం పేరుతో ఎప్పుడూ వసూలుచేయం. రైతుసంఘంపేరుతో వసూలుచేసిన ప్రతిదమ్మిడీ రైతుసంఘానికి పార్టీసభ్యులు చేర్చుతారు. దాని ఆదాయవ్యయాలను వివరాలతోసహా రైతుసంఘాలు ఉంచుతాయి. వానిని ప్రజాసామాన్యానికి రైతుసంఘాలు తెలియజేస్తూ ఉంటాయి. అందుచే రైతుసంఘం పేరుతో కమ్యూనిస్టు పార్టీకి వసూలుచేస్తున్నారనే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు అరికట్టవలసిందిగా కోరుతున్నాం.

— పుచ్చలపల్లి సుందరయ్య

(4వ పేజీ తరువాయి) ప్రభుత్వంక్రింద ఏర్పడబోయే మంత్రివర్గాలు కాంగ్రెసుమంత్రివర్గాలు కావు. ముస్లింలీగ్‌తో కలసిన సంయుక్త మంత్రివర్గాలు కేంద్రంలోను, రాష్ట్రాలలోను ఏర్పడాలి. అప్పుడే నిజమైన జాతీయ ప్రభుత్వం ఏర్పడగలదు.

ముగింపు

మానవత్వం అన్నిటికంటే ప్రధానమైనది. కాంగ్రెసుకంటే, దేవునికంటే అన్నిటికంటే ఉత్కృష్టమైన మానవత్వాన్ని పాటించి కాంగ్రెసువారులు పనిచేయాలి. బెంగాలులో వైద్యసహాయక సంయుక్తకమిటీ అధ్వర్యాన కాంగ్రెసు, ముస్లింలీగు, కమ్యూనిస్టులు, మహిళాసంఘం, అందరూ ఐక్యమై కరువుబాధితులకు, మానవత్వాన్ని రక్షించుటకు చేసిన కృషి ఆదర్శంగా పెట్టుకొని పనిచేయాలి. సరియైన దృక్పథంతో పనిచేస్తే సరియైన ఫలితం వస్తుంది. సంకుచిత జాతీయదృక్పథం సరియైన మార్గం కాదు. స్వాతంత్ర్యం వచ్చేవరకు జాతీయ చైతన్యం ప్రాముఖ్యమైనా, సరియైన అంతర్జాతీయ దృక్పథంతో పనిచేసినపుడే మనం సరియైన శాంతి, సౌభ్రాతృత్వాన్ని, లోకకల్యాణాన్ని స్థాపించడానికి సహాయపడగలం.

జర్మనీపై ఎర్రసైన్యాల విజయయాత్ర

డిసెంబరు నెలలో ప్రపంచమంతటా కారుమేఘాలు ఆవరించినట్లు కన్పించాయి. అల్లదిగో మిత్రరాజ్యాలలో విభేదాలు! ఇదిగో జర్మనీవాళ్ళు తిరుగుదెబ్బ కొడుతున్నారు. బ్రిటీషు, అమెరికను సైన్యాలను పశ్చిమరంగంలో వెనక్కి తరుముతున్నారు చూడండి! హాంగరీలో జర్మన్ తిరుగుదాడి అదిగో! బుడాపెస్టు యుద్ధం, అసలు యుద్ధగతినే మార్చుతుంది కాచుకోండి! అని పాసిస్టు అనుకూలురు డప్పులుకొట్టారు.

నాజీలనుండి విముక్తిచెందిన గ్రీసు - బెల్జియం దేశాలలో దేశభక్తసైన్యాలను విరాయుధులను చేసి, బ్రిటీషు సామ్రాజ్యవాదులు నిరంకుశ ప్రభుత్వాలను నెలకొల్ప చూస్తున్నారు అవి మిత్రరాజ్యాల అనుకూలురు శీతిచెందారు.

జనవరిలో క్రమంగా కారుమేఘాలు తొలగిపోతున్నాయి. జర్మనుల తిరుగుదండయాత్రలు మొక్కవోయాయి. మిత్రరాజ్యాలు విలదొక్కుకొని, చొరవతో తిరుగుదెబ్బలు కొడుతున్నాయి. బ్రిటీషు సామ్రాజ్యవాదులు విముక్తదేశాలలో తెచ్చిన పితలాటాలు ఓడిపోయి, దేశభక్తులందే పైచేయి అవుతూంది.

పశ్చిమరంగం

బెల్జియంలో జర్మన్ల తిరుగుదాడిని మిత్రరాజ్యాలు అపుచేశాయి. ఇది వివలమయ్యాక నాజీలు పార్‌రంగంలో యింకో అకస్మికదెబ్బ తీశారు. ప్రథమంలో 15 మైళ్లు ముందుకు తోసుకువచ్చారు. అమెరికా 7 వ సైన్యం యీ దండయాత్రను కూడా అపుజేసింది. ఈ దండయాత్రలవల్ల జర్మన్ సేనాని ఒకటి సాధించారు. బ్రిటను అమెరికాలు వేస్తున్న శీతాకాలపు దండయాత్ర ప్లానులను దెబ్బకొట్టారు. జనరల్ ఐసన్‌హోవర్ తన సైన్యాలను సర్దుకొని, కొత్తవ్యూహాలను వేసుకోవలసివచ్చింది. జర్మన్లకు కొంత వ్యవధి దొరికింది. అంతే!

ఈ అవకాశమైనా జర్మనులకు ఎందువల్ల వచ్చింది? యుద్ధవిషయాలలో నిపుణుడు, స్పెయిన్‌లో పాసిస్టులకు వ్యతిరేకంగా పోరాడిన అంతర్జాతీయ సేనకు నాయకుడు, టామ్ వింట్రింగ్‌హామ్, యిలా వ్రాశాడు: తిరుగుదాడికి తోడుగా జర్మన్లు బెల్జియంలోనూ, లక్సెంబర్గ్‌లోను తమ పారచూట్ సైనికులను దింపారు. అంతకుపూర్వమే బ్రిటీష్‌సామ్రాజ్యవాదులు దేశభక్తసైన్యాలను విరాయుధులను చేశారు. తిరుగుదాడి చేస్తున్న జర్మన్లతో పోరాడటానికి దేశభక్తులకు ఆయుధాల్లేవు. అందువల్లనే జర్మన్లు ముందుకు తోసుకు రాగలిగారన్నారు. ఈ విధంగా విముక్తి పొందిన దేశాలలో ప్రజావిరోధులను గద్దెపై ఎక్కించాలనే ప్రయత్నాలవల్ల యుద్ధం యింకా దీర్ఘం అవుతోందని ఆక్షేపించాడు. మిత్రరాజ్యాలమధ్య విభేదాలకు కారణమవుతూందని వివరించాడు.

సోవియట్ రథం

స్టాలిన్ మహారథుడు శీతాకాలపు దండయాత్ర ప్రారంభించాడు. జకోస్లోవేకియా నుంచి బాల్టిక్ సముద్రందాక యుద్ధరంగమంతటా ఎర్రసైన్యాల సమ్మెట దెబ్బలు జర్మన్ రక్షణ శ్రేణులను ఉక్కిరిబిక్కిరి చేసాయి. నాజీమూకలను వెన్నంటి తరుముతున్నాయి.

స్టాలిన్ వ్యూహరచనా నైపుణ్యం చూడండి! బుడాపెస్టు నగరంతో పోరాటం యింకా అలా సాగుతూనేఉంది. నాజీ బలగాలను అచట ఒక కాలుతో నొక్కిపట్టాడు. బాల్టిక్ రంగంలో 30 డివిజన్లను అలాగే నొక్కిపట్టాడు. యుద్ధసామగ్రిని, సైన్యాలను యుద్ధరంగం పొడుగునా సమీకరించాడు. నాజీశ్రేణులపై పిడుగులవర్షం కురియసాగింది. ఇదిచూడండి! జర్మన్ సేనలగతి!

జనవరి 12 వ తేదీన దక్షిణపోలెండులో మార్షల్‌కొనీవ్ దండయాత్ర ప్రారంభించాడు. రెండురోజులు సోవియట్ ఫిరంగులు గుండ్లవర్షం కురిపించాయి. సోవియట్ టాంకులు, సైన్యాలు జర్మన్ రక్షణశ్రేణిలో 40 మైళ్లు గండికొట్టాయి. మొదటిదెబ్బతోనే 25 మైళ్ళు ముందుకు తోసుకుపోయాయి.

కెల్సినగరం ఆక్రమించాయి. క్రమంగా దక్షిణపోలెండుకు ప్రధాననగరం క్రేకోవ్ హస్తగత మయింది. సోవియట్ సేనలు 1300 జనపదాలను పట్టుకొని జర్మన్ సైలీషియా సరిహద్దుకు చేరాయి. 5 రోజులలో 110 మైళ్ళు ఎర్రసైన్యం ముందుకు నడిచింది. జర్మనులు చిందరవందరగా పలాయనం చిత్తగించారు.

అటు మధ్యపోలెండులో మార్షల్ జుకావ్ సైన్యాలు దెబ్బకొట్టాయి. జర్మన్ శ్రేణులను వార్సాకు దక్షిణంగా చీల్చాయి. విస్టులానదిని దాటి పశ్చిమోత్తరంగా ముందంజవేసి వార్సా నగరాన్ని చేరుచేశాయి. వార్సానగరంలోని జర్మన్ కోటలు నిరుపయోగంకాగా, పోలెండు ముఖ్యనగరం సోవియట్ రాణువుల స్వాధీనమయింది. జుకావ్ సైన్యాలు పరుగులిడీస్తూ శత్రువును వెన్నంటి తరుముతున్నాయి. పోలెండులో రెండో పెద్దపట్టణమైన లాడ్జా నగరాన్ని ఎర్రసైన్యం విముక్తి చేసింది. క్రమంగా వార్సాకు 110 మైళ్ళు పడమరగా వున్న కిలోపట్టణం ఎర్రసైన్యం స్వాధీనమయింది. అనగా 8 రోజులలో మార్షల్ జుకోవ్ సైన్యాలు బెర్లిన్‌వైపుకు మూడోవంతు దూరం పురోగమించాయి.

ఉత్తరపోలెండులో మార్షల్ రొకొసొవిస్కీ మరోదండయాత్ర ప్రారంభించాడు. సోవియట్ టాంకులు తూర్పుప్రష్యా రక్షణలను ఛేదించాయి. ఎర్రసేనలు డాంజిగ్ నగరం వైపు పురోగమించుతున్నాయి. అనగరానికి ఈశాన్యంగా 85 మైళ్ళలో వున్నాయి.

జనరల్ చెర్నియాకోవస్కీ సైన్యాలు అటు ఉత్తరాన్నుంచి తూర్పు ప్రష్యాపై దెబ్బ తీశాయి. టిల్సిట్ నగరం రష్యనుల స్వాధీనమయింది. ముఖ్యపట్టణమైన కోనిస్‌బర్గ్ వైపు ఎర్రసైన్యం పురోగమించుతోంది. తూర్పు ప్రష్యాలోకి 40 మైళ్లు ఎర్రసైన్యం చొచ్చుకుపోయిందని అఖరివార్తలు తెలుపుతున్నాయి.

ఇటు జెకోస్లొవేకియాలో 4 వ యుక్రేన్ సైన్యం కార్పేథియన్ పర్వతాలకు రెండు వైపులా దాడి ప్రారంభించాయి. రోడ్డ కేంద్రమైన "కోషీ" పట్టణం ఆక్రమించాయి. క్రాకోవ్ నగరానికి 45 మైళ్ళు ఆగ్నేయంగా వున్న 'నవోసాజ్' స్వాధీనం చేసికొన్నాయి. వరి పీఠభూములలో కార్పేథియన్ పర్వతాలలో దండయాత్ర నిజంగా విభ్రాంతికొల్పే చారిత్రక సంఘటన అనవచ్చు.

ఈ విధంగా జర్మన్ వ్యూహం పటాపంచలైపోయింది. ఒక వారంలో 25 వేల జర్మనులు ఖైదీలుగా చిక్కారు. 65వేలు చచ్చారు. ఎర్రసేనలు మొత్తం 2500 జనపదాలను నాజీ దాస్యంనుంచి విముక్తిచేశాయి.

చిందరవందరవుతున్న తమ సైన్యాలను కట్టుదిట్టం చేసికోడానికి నాజీ దురంతకుడు హిమ్లరు సైలీషియాకు వెళ్లాడు. నిలవదొక్కుకొని సోవియట్ సైన్యతరంగాలను అడ్డటానికి కొత్త రక్షణశ్రేణిని పునర్నిర్మించుకోడానికి అతడు ప్రయత్నించవచ్చు.

మాస్కోరేడియో చెప్పినట్లుగా సోవియట్ సైన్యాలు బెర్లినువైపు విజయయాత్ర ప్రారంభించాయి. సోవియట్ సేనానులు చెప్పినట్లుగా, వారి ప్రధానలక్ష్యం "నాజీమూకలను వెన్నంటి, తరిమి పట్టుకొని హతమార్చడమే" అందుకే ఎర్రసైన్యాల రథం కదిలింది. అడ్డు నిలచిన గులకరాళ్ళను నుశిచేసికుంటూ ముందుకు సాగుతోంది.

ల్యూజాన్ దీవిపై అమెరికా దండయాత్ర

అటు పసిఫిక్ సముద్రంలో అమెరికా సైన్యాలు ఫిలిపైను దీవులపై మరో క్రొత్త దండయాత్ర ప్రారంభించాయి. లెటీదీవిని పూర్తిగా విముక్తిచేశాయి. ఇపుడు ల్యూజాన్ దీవిపై మూడుచోట్ల అమెరికా సైన్యాలు దిగాయి. 20 మైళ్ళ పొడుగునా 25 మైళ్ళు లోనికి చొచ్చుకుపోయాయి. జపాన్ సైన్యాలు చెప్పతగినంతగా ఎదిరించలేక పోయాయి. అమెరికా విమానాలు ముందుగా రవాణా మార్గాలపై దెబ్బగొట్టాయి. అనుకోనిచోట ఆకస్మికంగా దిగుటచే జపానువాళ్ళు తమ సైన్యాలను రక్షణకుసమీకరించలేకపోయారు. క్రమంగా కూడదీసికొని ముందు ముందు తీవ్రంగా పోరాడవచ్చు. కాని ఏమైనావాళ్ళు దెబ్బకాచుకునే స్థితిలోకి దిగజారారు. అమెరికాసైన్యాలకే చొరవచేసి దెబ్బకొట్టే వీలు చిక్కింది.

అమెరికాసైన్యాలు 'మనిలా' వైపుకు పురోగమించుతున్నాయి. ఇదిగాక అమెరికన్ నావలు ఇండోచైనా సముద్రతీరంలో జపాన్ నావలతో ఢీకొన్నాయి. 25 జపాన్ నావలను ముంచివేశాయి. జపాన్ నావికాదళానికి ఇది తీరని నష్టం.

అక్యాబ్ ఆక్రమణ

బర్మాలోకల్లా ముఖ్య రేవుపట్టణాలలో మూడవది అయిన అక్యాబ్‌ను మిత్రసైన్యాలు ఆక్రమించాయి. అచట మందుపాతరలు వగైరా ఆటంకాలేగాని జపానువాళ్లు నిలచి పోరాడనేలేదు. తుపాకులుపేల్చే అవసరం లేకుండానే మిత్రసైన్యాలు అక్యాబ్‌లో ప్రవేశించాయి.

ఉత్తరాన బర్మా - చైనా రోడ్డును స్వాధీనం చేసికోడానికి పోరాడుతున్న అమెరికా సైన్యాలు చైనా సైన్యాలను కలసికోడానికి ముందుకు తోసుకుపోతున్నాయి. రెండిటికీ మధ్య 20 మైళ్ళు అంతరం మాత్రమే ఉంది.

జపాన్ కొత్తఎత్తు

జపానువాళ్లు బర్మాలో వెనక్కి తగ్గడం చూస్తే ఒకటి బోధపడుతుంది. వాళ్ళు ఇతర రంగాలలో వెనక్కితగ్గి చైనాలో తమ సైన్యాలను కేంద్రీకరించుతున్నారు. చైనాను మిత్రరాజ్యాలనుండి వేరుచేయడానికి, భూమార్గం ద్వారా తమ సైన్యాలకు సరఫరాలు అందచేయడానికి ప్రయత్నించుతున్నారు. కింగ్‌యాన్‌నగరంఆక్రమించుకున్నారు. లూచోవ్ - లాంగ్‌సన్‌ల మధ్య 300 మైళ్ళ రైల్వేలు నిర్మించివేశారు. ఉత్తరచైనానుంచి దక్షిణచైనాకు 4000 మైళ్ళ రైలుమార్గాలు జపాన్ వాళ్ళచేతుల్లో వుంటాయి. అంతేగాక కుమింగ్ నగరం బర్మా - చైనా రోడ్డుకు చివరి భాగంలోవుంది. అది జపానువాళ్ళ చేతుల్లో పడితే చైనాకు మిత్రరాజ్యాలతో సంబంధం లేకుండా చేయవచ్చు.

జపాన్ ఎత్తులను భగ్నం చేయడానికి ఒకటేమార్గం వుంది. చైనాను బలపరచాలి. చైనాలో సంయుక్త ప్రజాప్రభుత్వాన్ని ఏర్పరచాలి. లంచగొండులైన అధికారులను తొలగించి ప్రజల సహకారం సంపాదించాలి. అందుకు ప్రజాస్వామిక సూత్రాలను ప్రభుత్వంలోను, సైన్యంలోను కూడ ప్రవేశపెట్టాలి. చైనా కమ్యూనిస్టు నాయకుడు మావోసీటుంగ్ చెప్పినట్లుగా చైనాను రక్షించడానికి, జపాన్ దుండగీడులను ఓడించడానికి మిత్రరాజ్యాలు అనుసరించాలసిన మార్గం యిదొకటే.

— మద్దుకూరి చంద్రశేఖరరావు.
22—1—45.

(మూడవ పేజీ తరువాయి)

5. రంగాగారి రష్యా వ్యతిరేకప్రచారాన్ని బలపరచడం. ప్రపంచ ప్రజలందరితోపాటు సోవియట్ సఖ్యతకోరే కాంగ్రెసు సాంప్రదాయాన్ని ధ్వంసం చేయడం.

అందుచే కమ్యూనిస్టులను కాంగ్రెసునుండి తొలగించాలని రంగా, కాశేశ్వరరావుఁచేసే ప్రయత్నాలను సాగనివ్వకుండా దేశభక్తులూ, ప్రజలూ చూడాలని కోరుతున్నాం.

జోహారులు

కొత్తపట్నం (ఒంగోలు తాలూకా) వాస్తవ్యుడు, కామ్రేడ్ కావలి రాఘవరెడ్డి 1943 జూన్‌లో కమ్యూనిస్టుపార్టీలో చేరి, అనేక కుటుంబ చిక్కులను, తన ఆర్థికదుస్థితిని లెక్కచేయక పార్టీ కార్యక్రమంలో వాల్గొని పనిచేశాడు. పోయిన జూన్ నెలలో మలేరియా నివారణ కమిటీ ఆధ్వర్యాన బియ్యం, మందుల పంపిణీ జరిగినప్పుడు, సముద్రతీర గ్రామాలన్నీ తిరిగి, మలేరియారోగులకు తనతోడి బీదరైతులకు క్వినైన్ పంచి, అనేకవందల ప్రాణాలు కాపాడాడు. యీ కామ్రేడ్ గతరెండునెలలనుంచి మలేరియాతో బాధపడి, 45 వ ఏట 11—1—45 న మరణించాడు.

ప్రజాసేవయే తన ఆశయంగా పెట్టుకొని పనిచేసిన యీ కామ్రేడ్‌కు మా జోహారులు.

ఎలిమెంటరీస్కూలు ఉపాధ్యాయుల కడగండ్లు

— తమ్మారెడ్డి సత్యనారాయణ

సమాజంయొక్క విజ్ఞానాభివృద్ధి చాలవరకు ఉపాధ్యాయులమీద ఆధారపడియుంది. ఉపాధ్యాయులు సమాజంయొక్క విజ్ఞానసంపద. భావిపౌరులను తయారుచేసే బాధ్యత అంతా ఉపాధ్యాయులమీద వుంది. సమాజంలో ఇంత ప్రముఖస్థానం వహించి, ఇంత పెద్దబాధ్యతను నిర్వర్తించవలసిన ఉపాధ్యాయుల పరిస్థితి మాత్రం హృదయవిదారకంగా వుంది. జీవితావసరవస్తువుల ధరలు విపరీతంగాపెరిగిపోయినాయి. కాని జీతాలుమాత్రం 1939 స్కేలులోనే ఇస్తున్నారు. ఈ వచ్చే కొద్దిజీతాలలో అనేక రకాలైన కట్నాలు చెల్లించుకోవలసి యుంటుంది. అందుచేత మామూలు జీవితం గడపడంకూడ దుర్భరమైపోయింది. అందువల్ల జీవితం గడపడానికి ఇతరవృత్తులుస్వీకరించి, విద్యావిధానానికి దెబ్బగొట్టవలసి వస్తోంది. ఉపాధ్యాయులకున్న వివిధకష్టాలను వెంటనే నివారించకపోతే, ఉపాధ్యాయులు తమ కర్తవ్యాన్ని సరిగా నెరవేర్చలేరు. యుద్ధానంతరం విద్యా పునర్నిర్మాణానికి పెద్ద పెద్ద ప్లానులను తయారుచేస్తున్న ప్రభుత్వం ఈనాడు ఉపాధ్యాయుల కష్టాలను నివారించడానికి పూనుకొనకపోతే, ఆ ప్లానులన్నీ పేపరుప్లానులే అవుతాయి.

జీతాలు

గ్రాంటుపాఠశాలల్లో ఉపాధ్యాయుల పరిస్థితి అందరికంటె అధ్వాన్నముగా ఉన్నది. నెలకు రు. 14 లు ఇస్తారు. ఇదికూడా ప్రతినెలారాదు. ఏ మూడునెలలకో, 6 నెలలకో ఒకసారి గ్రాంటు వస్తుంది. ఈవచ్చే రు. 14 లలో నూటికి 15 రూపాయల చొప్పున స్కూలు పరికరాలకు తగ్గించి మేనేజిమెంటు తీసుకుంటుంది. అంటే, ఖచ్చితంగా ఉపాధ్యాయునకు గిట్టేది రు. 11-14-5లు. దీనితోపాటు క్రిందటి నెలవరకు 4 రూ. చొప్పున యుద్ధ అలవెన్సు ఇచ్చారు. ఈ నెలనుంచి 8 రూ. ఇస్తామని ప్రభుత్వంప్రకటించింది. అయినాగాని, నెలకు గిట్టేది సుమారు 20 రూపాయలు. ఈ జీతం భార్యాభర్తలకు కూడా చాలదు. ఇక పిల్లలున్నవారి బాధలు దేవునికే తెలియాలి. ప్రభుత్వం గ్రాంటు పాఠశాలల ఉపాధ్యాయులకు కనీసం బోర్డు ఉపాధ్యాయుల స్కేలు ఇస్తూ, ఇతర గవర్నమెంటు ఉద్యోగులకందరికి ఎంత యుద్ధఅలవెన్సు ఇస్తున్నారో అంత ఇవ్వాలి. ప్రతినెలా జీతాలు వచ్చేటట్లు చేయాలి. స్కూలుకు కావలసిన పరికరములు కొనుటకు ధనం ప్రభుత్వమే ఇవ్వాలి. ఉపాధ్యాయుల జీతాలలోనుంచి నూటికి 15 రూ.లు మినహాయించడం మానివేయాలి. అప్పుడే ఉపాధ్యాయులు తమకర్తవ్యాన్ని సంతోషంతో నెరవేర్చగల్గుతారు.

సర్టిఫికేట్ల రద్దు

ఉపాధ్యాయులు తప్పుచేసినచో, 154 వ రూలుప్రకారం అధికారులు సర్టిఫికేట్లు రద్దు చేయవచ్చు. ఈఅవకాశాన్ని తీసుకుని, అధికారులు ఈరూలును దుర్వినియోగపరుస్తున్నారు. తమకు ప్రత్యేక సౌకర్యములు, లంచములు ఇవ్వకపోతే కొంతమంది డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు ఉపాధ్యాయులపై ఏదో ఒక నేరమారోపించి, సర్టిఫికేట్లు తీసుకునిపోయి రద్దు చేయమని సిఫారసు చేస్తున్నారు. ఈ రూలు లంచగొండితనాన్ని పెంపొందించడానికే ఉపయోగపడుతోంది. ఉపాధ్యాయులు తప్పుచేస్తే, ఇంకా ఏదైనా శిక్షలువేయవచ్చు గాని సర్టిఫికేట్లు రద్దుచేయడమంటే, అతనికి సంఘంలో తావులేకుండా చేయడమన్నమాట. ఏశిక్ష ఐనాగాని, ఉపాధ్యాయుడు తన తప్పును గుర్తించేటట్లు ఉండాలిగాని, అతని జీవితభృతినే తీసివేయడం ఘోరాన్యాయం. కాన, వెంటనే ఈ 154 వ రూలును రద్దుపర్చాలి.

నిష్పత్తి పద్ధతి రద్దుగావాలి

ప్రస్తుతం ఎలిమెంటరీపాఠశాలలలో మొదటి తరగతిలోని బాలురనుబట్టి రెండవతరగతిలో 100 కి 75, మూడవతరగతిలో 100 కి 50, నాల్గు, ఐదులలో 100 కి 25 బాలురుండవలెనని ఒక నిబంధన వున్నది. ఈ నిష్పత్తి ప్రకారం బాలురను ఉంచడం సాధ్యమా, కాదా అనే విచక్షణ లేకుండా, ఈ నిష్పత్తిని చూపించకపోతే గ్రాంటులుతగ్గించడమో, పాఠశాలలు రద్దుచేయడమో చేయుచున్నారు. గ్రామంలో నడికి వెళ్లే యీడుగల ఆడపిల్లల మొత్తంలో నాల్గవవంతు బాలికలు పాఠశాలలో లేనియెడల దానిని మూసివేయాలని నిబంధన మరియొకటి వుంది. ఈ నిష్పత్తిలో బాలురను-బాలికలను స్కూలుకు తీసుకు రావాలని ఉపాధ్యాయులను, స్కూలుకు పిల్లలను పంపమని ప్రజలను, ప్రోత్సహించాలి. అంతేగాని, నిష్పత్తిలేదనే సాకుతో స్కూళ్ళు మూసివేయడం విద్యావిధానాన్ని అరికట్టడం తప్ప మరొకటిగాదు. ఈనిష్పత్తినిబంధనవల్ల రాష్ట్రంలో దాదాపు 100 ఎయిడెడ్ స్కూళ్లు మూసివేశారని తెలుస్తోంది. కాబట్టి విద్యావిధానాన్ని ఆరికట్టే ఈ నిష్పత్తి పద్ధతిని రద్దుచేయాలి.

నిండుజీతముమీద సెలవు లివ్వాలి

1933 సంవత్సరం, తర్వాత జిల్లాబోర్డు స్కూళ్ళలో ఉపాధ్యాయులుగా చేరినవారికి సగం జీతంమీదనే సెలవులు ఇస్తున్నారు. అంటే, ఉపాధ్యాయునకు జబ్బుగా ఉన్నపుడుగాని, ఇంకా ఇతర సందర్భాలలో సెలవుతీసుకున్నప్పుడుగాని, పస్తు ఉండాలన్నమాట. ఈ విధంగా చేయడం ఉపాధ్యాయవృత్తిలో చేరే వారిని నిరుత్సాహపరచడమవుతుంది. కాన నిండుజీతాలమీదనే సెలవులు ఇవ్వాలి.

ప్రయాణపు ఖర్చులు

ఉపాధ్యాయులను బదిలీ చేసేటప్పుడు వారి కోరిక పైననో, లేక శిక్షగానో బదిలీచేసినట్లు వ్రాసి, ప్రయాణపు ఖర్చులు ఇచ్చుటలేదు. కాబట్టి ఏకారణంపై బదిలీ చేసినను, ఉపాధ్యాయులకు తప్పకుండా ప్రయాణపు ఖర్చులివ్వవలయును. లేకపోతే, వచ్చే కొద్దిజీతంలో ప్రయాణపుఖర్చులుకూడా తానేపెట్టుకుంటే ఉపాధ్యాయుడు జీవించడమే కష్టం. అదిగాక ఉపాధ్యాయులను అనవసరంగా అనేకసార్లు బదిలీచేస్తున్నారు. ఇందువల్ల వారు ఎక్కడాకూడా సరిగా తమ కర్తవ్యాన్ని నెరవేర్చలేకపోతున్నారు. కాబట్టి పలుమార్లు బదిలీచేయడం మానివేయాలి.

ఇతరకష్టాలు

భార్యాభర్తలిద్దరూ ఉపాధ్యాయులే అయినప్పుడు, ఇద్దర్నీ వేరు వేరు ప్రదేశాలలో నియమించడం అన్యాయం. ఇద్దర్నీ ఒకే ప్రదేశంలో ఉంచాలి. పాఠశాలలో చేతిపనులను నేర్పాలని నిబంధన లోఉన్నది. కాని, ఇదివరకు ట్రయినింగు తీసుకున్నవారెవరికీ చేతిపనులను గురించి తెలియదు. కాబట్టి వారికి వేసవిలో ప్రత్యేక క్లాసులనుపెట్టి, చేతిపనులలో తర్ఫీదుఇవ్వాలి.

హయ్యరు ఎలిమెంటరీ పాఠశాలలలోని 8 వ తరగతి బాలురకు సెకండరీగ్రేడు ఉపాధ్యాయులు తెలుగు చెప్పలేకపోతున్నారు. వారికున్న సిలబసును పూర్తిగాను, విద్యార్థుల కర్థమయ్యేటట్లు చెప్పాలంటే ఒక తెలుగు పండితుడు అవసరం. కాబట్టి వెంటనే ప్రభుత్వం ప్రతి హయ్యరు ఎలిమెంటరీపాఠశాలలోను ఒక తెలుగుపండితుని నియమించాలి. తెలుగుపండితునికి సెకండరీగ్రేడు స్కేలు ప్రకారం జీతం ఇవ్వాలి.

ఇదివరకు లోయరుగ్రేడు ఉపాధ్యాయులకు హయ్యరుగ్రేడు పరీక్షకు హాజరగుటకు అవకాశాలిచ్చారు. దీనివల్ల చాలమంది ఉపాధ్యాయులు పరీక్షకు చదివి హయ్యరుగ్రేడులో ఉత్తీర్ణు లయ్యారు. ఉపాధ్యాయునికి కనీసం సెకండరీగ్రేడు ట్రయినింగు ఉండాలని యుద్ధానంతర విద్యాపునర్నిర్మాణ స్కీములలో చెపుతున్నారు. కాన, హయ్యరుగ్రేడు ఉపాధ్యాయులకు సెకండరీగ్రేడు పరీక్షకు కూడా కూర్చునే అవకాశాలు కలుగచేయాలి.

హయ్యరుఎలిమెంటరీపాఠశాలలలో 8 వ తరగతికి పబ్లికు పరీక్ష పెట్టుచున్నారు. పరీక్షనంతరం విద్యార్థులు పరీక్షలో ఉత్తీర్ణు లయ్యిందీ, లేనిదీ మాత్రమే హెడ్‌మాష్టర్లకు తెలియవస్తున్నారు. విద్యార్థులు ఏవిషయాలలో వెనుకబడియున్నారో, ఉపాధ్యాయులు ఏవిషయాంపై కేంద్రీకరించాలో, తెలుసుకొనడానికి మార్కులు లేకపోతే కష్టంకాబట్టి తప్పక మార్కులు హెడ్‌మాష్టర్లకు పంపాలి.

ఈకోర్కెలకై అందరు ఆందోళన చేయాలి

ఉపాధ్యాయుల కోర్కెలు ప్రజలందరి కోర్కెలు. ఎందుచేతనంటే, ఉపాధ్యాయులు బాధపడటంవల్ల, మన పిల్లలకు విద్య సక్రమంగా చెప్పలేరు. కాబట్టి ఉపాధ్యాయుల కష్టాలను నివారించుటకు ప్రజలందరూ పూనుకోవాలి. మనరాష్ట్రంలో దిన, వారపత్రికలు కూడా ఉపాధ్యాయుల కష్టాల నివారణకొరకు ఆందోళన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఉపాధ్యాయులందరుకూడా ఈ కోర్కెలను సాధించడానికి ఆందోళనచేయాలి. మీకోర్కెలు సాధించదలచాలంటే, మీరు మీమీ పాఠశాలలను ఆదర్శవంతంగా నడపాలి. మీరు ఇలాచేయడం ద్వారానే ప్రజాసానుభూతితో మీ కోర్కెలను సాధించగల్గుతారు.

అభ్యుదయ సాహిత్యంవలెనే అభ్యుదయసంగీతం కావాలి!

పిఠాపురంలో కృష్ణశాస్త్రిగారి ఉపన్యాసం

12-1-45 వ తేదీతో పిఠాపురంలో త్యాగరాయ నవరాత్రి మహోత్సవాలు జయప్రదంగా ముగిశాయి. సంగీతసభలలో చాలామంది యువకులు, యువతులు పాల్గొని, చక్కని గాత్రాలతో సభికులను రంజింపజేశారు. సభలకు అధ్యక్షులైన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సభను ఉపసంహరిస్తూ, క్రింది విధంగా ఉపన్యసించారు.

"సాహిత్య సంగీతాలకు అవినాభావ సంబంధముంది. ఈ రోజున సాహిత్యంలో గొప్ప విప్లవం వచ్చింది. మాతరంవారం మా ముందుతరంవారిని నిలదీసి ప్రశ్నించాం. అదేమీ అంత ఉన్నతమైన సాహిత్యంకాదని ధీకొన్నాం; గెలిచాం. అలాగే ఈవేళ యువకులు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు కావలసిన సాహిత్యం సృష్టించమంటున్నారు. మార్పు కావాలంటున్నారు. యుద్ధం, కరువు దేశంలో గొప్ప సంచలనాన్ని కల్గించాయి. కవి వీటినిచూస్తూ సహించగలడా? ప్రస్తుతం మనం అవసరమైన కొన్ని వంతెనలు నిర్మించాలి. శాంతిసమయంలో గొప్ప తాజ్‌మహల్‌ను మనం కట్టుకోవచ్చును. నవ్యసాహితీ పరులందరికీ నేను దేవే చెప్పాను. చెపుతూ వస్తున్నాను. మనం నిలువుగా, గోపురాలవలె, పెరగడం నేర్చుకున్నాం. అంటే, వ్యక్తులు మాత్రం. ఇంక, అడ్డుగా మైదానాలమాదిరి మనం పెరగాలి. అంటే, పదిమందినీ కలుపుకోవాలి. ప్రజలలోకి చొచ్చుకుపోవాలి. ప్రజలు నిర్మించిన ప్రతి నిర్మాణమూ మహోన్నతమైనది. అభ్యుదయ రచయితలు ప్రజల రచయితలు. వారు యుక్తులనీ, గొప్ప సాహితీ అనుభవం వారికి లేదనీ, మనం నిరసించుకూ కాలంగడిపేశాం. మనం కవాలకంటె ఏ విషయంలోనూ గొప్పవాళ్ళం కాము. మనకు జీవం వుండదు. మనం చచ్చికిందపడిపోతే మనమీద యువక రచయితలు వాళ్ళ సాహిత్యం నిర్మించుకుంటూ ప్రజల దుఃఖాలమీద చేతులు వేసుకుని ముందుకుపోతారు. ఐర్లాండులో ఒక్కనాటకం స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టింది. సాహిత్యంలో అభ్యుదయం వచ్చినపుడు, సంగీతంలోనూ అభ్యుదయం వచ్చి తీరుదుంది. వచ్చితీరాలి. శాస్త్రంఅంటూ శ్రోతలకు వినుగుపుట్టించేది, రసానుభూతిని హృదయాని కందివ్వలేనిది మంచి సంగీతం కాదు. అంటే శాస్త్రం గొప్పదికాదనికాదు. పాటలోని భావం బాణంవలె ఎదగుండెకు తగిలి, రక్తాన్ని చిమ్మించాలి. అంత వచ్చి హితంగా భావాన్ని అందివ్వాలి. కేవలం కుస్తీ సంగీతం నిష్ప్రయోజనం. ప్రజల కష్టసుఖాలు సంగీతంలో చెప్పాలి. కూలివారు ఈరోజున నాకు కూలి చాలదంటున్నారు. కర్షకుడూ అంతే! వారి అనుభూతి పాటలు పాడితే, దేశంలో మహాచైతన్యం వస్తుంది. దేశీయులలో స్వాతంత్ర్యపిపాసను లేవనెత్తే ముందుకుపోయే సంగీతం కావాలి. అభ్యుదయ సాహిత్యం వస్తోన్నట్లే, అభ్యుదయ సంగీతంకూడా వచ్చితీరాలి."

కృష్ణశాస్త్రిగారి ఉపన్యాసానంతరం కార్యదర్శి నివేదిక అందిచ్చారు. యువకుల గానాలతో సభ జయప్రదంగా ముగిసింది.

★ జనగామ తాలూకాలో

రైతులపై దారుణ హింసాకాండ

నేనీ మధ్య నల్లగొండజిల్లా (నైజాం) జనగామ తాలూకాలో 17 గ్రామాలు పర్యటన చేసి, అక్కడిప్రజల పరిస్థితులు స్వయంగా తెలుసుకున్నాను. ఇచ్చటి భూములు సారవంతమైనవి. వర్షాలు సంతృప్తికరంగానే ఉండుటవల్ల చెరువులకింద, కుంటలకింద [illegible] వరిపంట బాగా పండుతుంది. [illegible] యిక్కడే పంట అధికంగా, [illegible] కాని. యిక్కడి దేశముఖులు, వతన్‌దార్లు ప్రజల్ని పెట్టే బాధలు చూస్తే, మధ్యయుగాల నాటి అమానుషచర్యలు జ్ఞాపకం వస్తాయి. అన్నితరగతుల ప్రజల్ని వీరు చట్టవిరుద్ధంగా విపరీతమైన దోపిడీకి గురిచేస్తున్నారు.

వీరు పెద్ద పెద్ద భూస్వాములగుటచేతను, వీరే గ్రామ పటేలు - పట్వారీ (మునసబు కరణాలు) లగుటచేతను, గ్రామ జీవితమంతా వీరి గుప్పెట్లో ఉంటుంది. చట్టరీత్యా రైతుల కున్న హక్కులను వీరుఅపహరిస్తారు. వ్యవసాయకరుణంలో రైతు తనభూమిపై చేసుకొనే పనులు వదలిపెట్టి, వీరి భూమిపనున్న వలసి యుంటుంది. కిరాయిలేకుండా బండ్లపై ఎడపుతోలడం. ధాన్యాన్ని బండ్లపై తీసుకు వెళ్ళడం, రైతు చేసితీరాలి. వీరి పశువులు, గొర్రెలు, మేకలు రైతుల చేలల్లో స్వేచ్ఛగా మేస్తాయి. అందువల్ల తరచు పైర్లు నష్టమవుతూ ఉంటాయి. రైతుల సొంత భూముల్లోవున్న తుమ్మ మొదలగు చెట్లను వెల ఇవ్వకుండా వే,కొట్టుకొనిపోతూఉంటారు. గొల్లలు, రైతులు తమ మందలను సంవత్సరమంతా వతన్‌దార్ల పొలాల్లోనే మందపెట్టాలి. చెరువు కుంటలలోని వీరు మొదట వీరి పొలాలకేపోవాలి. పండుగలలోను, వివాహాది కార్యాలలోను, వీరు గొల్లలవద్ద వందలాది గొర్రెలను, మేకలను, ఉచితంగా తీసుకుంటారు. వ్యవసాయేతర వృత్తిగలవారివద్ద భోగయ్యే ఖర్చువు ఉచితంగానో, నామమాత్రమైన వెలకో, నిర్బంధంగా లాక్కుంటారు.

నిర్బంధవసూళ్ళు

సొంతభవనాలు కట్టుకొనుటకు, వివాహాలు చేయుటకు, మోటారుకార్లు కొనుటకు ప్రజలనుండి వీరు నిర్బంధంగా వేలకు వేలువసూలు చేస్తారు. ఈవిషయంలో శ్రీ విస్నూరు రామచంద్రారెడ్డిగారు ప్రముఖులు. వీరిభవనమును కట్టుటకై కనీసం 50 వేల రూపాయలైనా వసూలుచేసి యుంటారు. రైతుల్ని మోసగించి, బెదిరించి, భయపెట్టి, వారి భూములకు - ఎట్టి విలువ ఇయ్యకుండాగాని, లేదా కొద్దిగా యిచ్చిగాని - ఆక్రమించుకున్న ఉదాహరణలు వందలకొద్దీ ఉన్నాయి. సుమారు 100 సంవత్సరాలక్రితం రామన్నగూడెంలో కొందరు లంబాడీలు అడవినికొట్టి, 7 బావులు తవ్వుకొని, తెగిపోయిన ఒక కుంటను బాగుచేయించుకొని, 100 యకరాల భూమిని సేద్యం చేసుకుంటున్నారు. దానికి రు. 12 మంచి రు. 200 వరకు శిస్తు క్రమేణ హెచ్చించి, వసూలు చేసుకొంటున్నారు.

విస్నూరు రామచంద్రారెడ్డిగారు, వారి బంధువులు, కొన్ని గ్రామాలలో ధాన్యం వ్యాపారాన్ని నిషేధించారు. కరవెంది గ్రామంలో ఎవ్వరూ ధాన్యం వ్యాపారం చేయకూడదు. దేశముఖుగారికి పండిన ధాన్యాన్ని. ఇతరపంటలను నిర్బంధంగా ప్రజల యిండ్లలో నోని, తాము నిర్ణయించిన ధరలు వసూలు చేసుకుంటారు. అధికారులు, వారి పరివారము, గ్రామాలకు వచ్చినప్పుడు వారి కవసరమైన సరుకంతా ఉచితంగానే [illegible] సప్లయి చేయాలి. దేశముఖులకు, [illegible] వరకు సప్లయి చేసినప్పుడు [illegible] నిర్ణయించిన ధరలే పుచ్చుకోవాలి. [illegible] అధికారి అయినప్పటికీ, అతనికి [illegible]. కొన్ని సందర్భాలలో దెబ్బలు, తప్పవు. కేసులు పెడితే, ప్రజలు భయపడి వారిపక్షాన సాక్ష్యం యివ్వరు.

సాలీలవద్ద దసరా సమయంలో గుడ్డ, యితరసమయాల్లో కోళ్ళు, ఎట్టి ప్రతిఫలం యివ్వకుండానే తీసుకొంటారు.

వెట్టిచాకిరి

హరిజనులు, కుమ్మర్లు, చాకళ్ళు, మంగళ్లు మొదలైన వారినుండి వీరు అనేకవిధాల వెట్టి చేయించుకుంటారు. ఉదాహరణకు రామవరంలో వతన్‌దారుగారియింట్లో 4 గురు చాకళ్ళు నిత్యము పనిచేయాలి. వీళ్లు యిల్లు తుడుచుట, వంటసామగ్రివిత్తోముట, బియ్యం దంచి శుభ్రపరచుట, వందలకొద్దీ కుండలతో బావినుంచి నీరుతెచ్చి చెట్లకు పోయుట, పిస్తళ్ళకు ఆకులుకోసితినుకువచ్చుట మొదలైన పన్నీ చేయాలి. కదుపు రోజులలో ప్రతిరోజూ 8 గురు చొప్పున 8 నెలలవరకు పొలాల్లోపనిచేయాలి. పొలంనుండి ధాన్యాన్ని యింటికి మోయాలి. రైసుమిల్లువద్దకు తీసుకెళ్ళి, బియ్యం ఆడించి తిరిగి యింటికి మోసుకురావాలి. ఇంతపనీచేస్తే, ఒక్కొక్క చాకలికి లభించే ప్రతిఫలం సంవత్సరానికి 12 మణుగుల ధాన్యం!

మంగళ్ళు వీరియింట్లో దీపాలు వెలిగించడం, వక్కలుపేయడం, క్షౌరాలు చేయడం, బండ్లవెంట చాకలివారితోబాటు ప్రయాణం చేయడం, మొదలైన పనులు చేయాలి. ఇందుకు ప్రతిఫలం సంవత్సరానికి 1 పల్లా ధాన్యం మాత్రమే యిస్తారు.

పద్మశాలీలు బట్టలనేత తగ్గించుకొని, వీరి ధాన్యంకొట్టులపైన పనిచేయడం తప్పనిసరి. వరి కలుపుల సమయంలో స్త్రీలు పొలాలకు వెళ్ళి పనిచేయాలి (రామవరం).

కుమ్మర్లు వానాకాలంలో ప్రతిరోజూ అర పల్లాసజ్జలు పశువులకు వండిపెట్టాలి. చెరుకు వండించి, బెల్లంతీయడానికి కావలసిన కుండలన్నీ యివ్వాలి. కొన్నిటికి నాల్గవవంతు ఖరీదుమాత్రమే యిస్తారు. 4 సంవత్సరాలక్రితంవరకు 12 గురు కుమ్మరివాండ్లు రాత్రింబగళ్ళు బెల్లం వండడానికి ఉండిపోవలసి వచ్చేది. అందువల్ల వ్యవసాయం చేసుకోలేక గ్రామం విడిచి వెళ్ళిపోయారు. (రామవరం)

వ్యవసాయ తరుణంలో రైతుల అవసరాలేమీ పాటించక, వ్యవసాయ కూలీలను నిర్బంధంగా తీసుకెళ్ళి పనులు చేయించుకుంటారు. సామాన్యంగా రైతు యిచ్చే కూలికంటే వీరికి తక్కువయిస్తారు. అలా వెళ్ళకపోతే, బూతులు తిట్టడం, కొట్టడం, జుట్టు పట్టుకొని యీడ్చుకువెళ్ళడం-సర్వసాధారణ విషయాలు. రామవరంలో ఒక స్త్రీ స్ఫోటకంతో బాధపడుతూన్నప్పటికీ, ఆమె తల్లిని నిర్బంధంగా కూలికి లాక్కువెళ్ళారు. సాయంత్రం ఆమె తిరిగి వచ్చేసరికి కూతురు మరణించి యున్నదట! ఆ విషాదగాథను మాతో చెబుతూంటే, గుండెలు తరుక్కుపోయాయి. ప్రథమ రజస్వలై, వేరుగాకూర్చున్న యువతులను సహితం నిర్బంధంగా లాగుకుపోయిన ఉదాహరణ లున్నాయి.

ధాన్యసేకరణస్కీమును భగ్నమొనర్చుచున్నారు

వీరు గతసంవత్సరం లెవీ వసూళ్ళ సందర్భంలో బీదరైతులవద్ద ధాన్యం అదనంగా వసూలుచేసి, తమవద్ద వందలకొద్దీ పుట్లు ఉన్నప్పటికీ, ప్రభుత్వానికి సక్రమంగా తమవంతు లెవీ చెల్లించలేదు. లెవీ ధాన్యంవల్ల లభించిన సొమ్ములో కొంత తాము ఉంచుకొని, మిగతాదిమాత్రమే రైతుల కిచ్చేవారు.

సేల్సు సొసైటీలకొరకు గతసంవత్సరం శ్రీ కతారు రామచంద్రరావుగారు (రామవరం) 1½ లక్షల రూపాయలు వసూలుచేయ నిశ్చయించి, ఒకలక్ష వసూలుచేశారు. ఈవసూళ్ళన్నీ విచిత్రమైన నిర్బంధపద్ధతులతో చేయబడ్డాయి. సేల్సు సొసైటీలకు నిర్బంధంగా డబ్బు వసూలుచేయడం ప్రభుత్వోద్దేశంకాదు. కాబట్టి, ఆంధ్రమహాసభ చేసిన ఆందోళన ఫలితంగా, ఆ మొత్తంలో అధికభాగాన్ని రైతులకు తిరిగి యిచ్చివేయవలసివచ్చింది. ఇంకా కొంతధనం రైతులకు ముట్టవలసి యున్నదని విన్నాం. రైతులు యిష్టపూర్వకంగా, శక్తికొద్దీ, సేల్సు సొసైటీలకు ధనం యివ్వవలసినదిగా నేడు ఆంధ్రమహాసభ ప్రచారం చేస్తూంది. ఆహారసమస్యను పరిష్కరించడానికి యీ సొసైటీల అవసరాన్ని మేము గుర్తించి పనిచేస్తున్నాం. నిర్బంధపు వసూళ్ళనుమాత్రం తీవ్రంగా ఎదుర్కొంటాం.

చట్టవిరుద్ధమైన యీ దోపిడీని అరికట్టుటకు ఆంధ్రమహాసభ పూర్తిగా ప్రయత్నిస్తోంది. గత 4 మాసాల కృషి ఫలితంగా జనగామ ప్రజల్లో చైతన్యం కలుగుతూండడం వల్ల, పై అన్యాయాలు కొంతవరకు తగ్గినవి. కాని, అట్టి అన్యాయాలకు కారకులైన దేశముఖులు, వతన్‌దార్లు లెవీవసూళ్ళను ఆంధ్రమహాసభ కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారనీ, సేల్సుసొసైటీలకు ధనం రాకుండా చేస్తున్నారనీ, తప్పుడురిపోర్టులు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఇట్టి పాడుపద్ధతులవల్ల ప్రజా చైతన్యమును అరికట్టాలని వీరిఅభిప్రాయం. కాని, ప్రజలే వీరికి తగిన జవాబు చెప్పగలుగుతారు.

ప్రభుత్వ కర్తవ్యం

వెంటనే ప్రభుత్వం యీ విషయంలో శ్రద్ధవహించి, తగుచర్య తీసుకోవలసియుంది. ప్రభుత్వమునకు నల్లగొండజిల్లా కార్యదర్శిచే (ఆంధ్రమహాసభ) రిపోర్టు పంపబడినప్పటికీ, తాలూక్దారుగారికి ప్రజలు వందలకొద్దీ దరఖాస్తులు పెట్టుకొన్నప్పటికీ, యింకా విచారణ ప్రారంభంకాలేదు. ఇట్టి అన్యాయాలుచేసే దేశముఖుల్ని, వతన్‌దార్లను, వారి వారి వతన్‌లనుండి తొలగించి, వారిపై తగుచర్య తీసుకోవలసియుంది.

రావి నారాయణరెడ్డి,
(నిజాంరాష్ట్ర ఆంధ్రమహాసభాధ్యక్షులు)

---

15 వ గుంటూరుమండల గ్రంథాలయ మహాసభ, మాచర్ల

అధ్యక్షులు : శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు

ప్రారంభకులు : శ్రీ శరణు రామస్వామిచౌదరిగారు

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు గ్రంథాలయ ప్రదర్శనాన్ని తెరుస్తారు.

26-1-45 రాత్రి ప్రతినిధుల సమావేశం, తీర్మానములు, ఎన్నికలు, పల్నాటివీరులసుద్దులు.

27-1-45 ఉదయం 9 గంటలకు ఊరేగింపు (16 జతల ఎడ్లబండిమీద)

,, 11 గంటలకు గ్రంథాలయ ప్రదర్శన ప్రారంభం

,, సాయంత్రం 4 గంటలకు మహాసభ ప్రారంభం

1. మాచర్ల గాయకసమ్మేళనమువారి పాటకచ్చేరి
2. ప్రారంభోపన్యాసం
3. అధ్యక్షోపన్యాసం
4. కార్యదర్శి నివేదిక, (శ్రీ కస్తూరి కుటుంబరావుగారు)
5. ఉపన్యాసములు

ఈజిల్లాలోని ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ సభ్యులందరు మహాసభకు ప్రతినిధులు. ప్రతినిధిరుసుము రు. 1-0-0. సభ జరుగురోజు భోజనం ఉచితం. ప్రతినిధులందరు 26 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరునుండి బయలుదేరి రైలులో రావాలి. గుంటూరునుండి మాచర్లకు ఒక ప్రయాణఖర్చు రు. 1-9-0. నాగార్జునకొండ విహారయాత్రకు (28-1-45) ప్రయాణ భోజన ఖర్చులకు సుమారు రు. 3 లు అగును. దీనిని యాత్రికులే భరించుకోవాలి.

ఇట్లు,
కజ్జం బాలకోటయ్య, సొంఠి సీతారామరెడ్డి,
(ఆహ్వానసంఘ అధ్యక్ష, కార్యదర్శులు)

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE